ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



బాగుపడే.. దారెక్కడ?

కొత్తగా రోడ్ల నిర్మాణానికి కాదుకదా.. అధ్వానంగా తయారై, ప్రమాదకరంగా మారిన రోడ్ల మరమ్మతులకు కూడా ప్రభుత్వం నిదులు ఒక్క రూపాయి విదిల్చిన పాపానపోలేదు. గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు భారీగా ప్రభుత్వం దగ్గర పెండింగ్ ఉండటంతో అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్‌లూ పనులు చేయలేమని చేతులెత్తేశారు. దీంతో ప్రధాన రహదారులకూడా డొంక రోడ్లకంటే హీనంగా తయారయ్యాయి. వీటిపై ఇటీవల కాగ్ అనేక అభ్యంతరాలు వ్యక్తం చేసింది. పనుల విషయంలో నిర్లక్ష్యం, నిధుల మంజూరులో జాప్యం, బిల్లుల చెల్లింపుల విషయంలో పట్టనట్టు వ్యవహరించటంపై కాగ్ తలంటినా ప్రభుత్వం మాత్రం మాకేటి సిగ్గన్నట్టు నిర్మాణ పనుల పురోగతిని గాలికొదిలేసింది. దీంతో మోకాళ్ల లోతు గుంటలలో ప్రయాణించలేక, తప్పనిసరి అయి ఏదైనా వాహనంలో వెళ్లినా ప్రమాదాలకుగురై ప్రాణాలు పోగొట్టుకోవలసి రావటం దారుణమే.

- పాత పనులకు పాతర... కొత్త పనుల ఊసేలేదు
- నిధులివ్వని వైసీపీ ప్రభుత్వం... మధ్యలోనే ఆగిన పనులు
- అధ్వానంగా రోడ్లు, వంతెనలు
- గత టీడీపీ సర్కారు కాలంలో నిధుల మంజూరు
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క పైసా విదిలించింది లేదు
- బిల్లుల పెండింగ్‌తో పాత పనులు చేయలేమని చేతులెత్తేసిన కాంట్రాక్టర్‌లు
- కొత్త పనులకు నిధుల మంజూరు లేనేలేదు

తెనాలి, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): గత దశాబ్దకాలంలో జరగనన్ని రోడ్డు ప్రమాదాలు ఈ నాలుగేళ్లలోనే జరిగాయని ఆయా శాఖలు ఇచ్చిన నివేదికలు ఇస్తున్నాయి. కొత్త రోడ్ల నిర్మాణం అటుంచితే, పాతవాటికి పాతరేయడంతో రోడ్లపై తిరుగుతున్న జనం నడ్డి విరుగుతోంది. ప్రభుత్వం అనేక రూపాల్లో ఇస్తున్న సంక్షేమం డబ్బంతా వైద్యానికే సరిపోతుందంటూ ప్రతిపక్షాలూ ఎద్దేవా చేస్తున్నాయి. కాగ్ ఇటీవల ఇచ్చిన నివేదికలో గత ప్రభుత్వ కాలంలో మంజూరు చేసిన పనుల పురోగతి, కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఇచ్చిన నిధుల పురోగతిపై నివేదిక ఇచ్చింది. పాత



తెనాలి వీఎస్ఆర్ కళాశాల ఎదుట రహదారి దుస్థితి

పనులు అటుంచితే, 2023లో మంజూరుచేసిన నిధులకు సంబంధించిన పనులు కూడా కేవలం 5 నుంచి 15 శాతం లోపే పూర్తికావటం విశేషం.

తెనాలి -విజయవాడ రోడ్డు పనులు హుష్..

తెనాలి- మంగళగిరి ప్రధాన రహదారి వెంట గోడల నిర్మాణం, రోడ్డు మరమ్మతులకోసం 2017లో రూ.46 కోట్లు కేటాయించారు. దీనితో రోడ్డుకు ఇరువైపులా తూర్పు, నిజాంపట్నం కాల్వల వెంట గోడలు నిర్మించాల్సి ఉంది. అయితే గోడల నిర్మాణం 2022వరకు చేసిన కాంట్రాక్టర్లు అప్పటి నుంచి బిల్లులు రాకపోవటంతో పనులు చేయటానికి చేతులెత్తేశారు. మంజూరు చేసి న పనుల్లో రూ.25కోట్ల వరకు పనులు మాత్రం పూర్తయ్యాయి. మొత్తంమీద కేవలం 2.8 కి.మీటర్ల పొడవున గోడలు, రోడ్డు అభివృద్ధి చెయ్యాల్సిఉంది. కానీ తెనాలి నుంచి మంగళగిరి మధ్య 1.5 కి.మీ నుంచి 3.8 కి.మీ మధ్య కేవలం 200 మీటర్ల వరకు మాత్ర మే పని పూర్తిచేశారు. అయితే గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులే భారీగా పెండింగ్ ఉం డటంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. ఇదే రోడ్డు నందివెలుగు నుంచి రేవేంద్రపాడు వరకు గోడలు, రోడ్డు అభివృద్ధికి రూ.264 కోట్లు మంజూరు చేస్తూ సీఎం అంగీకరించారని జగన్ సర్కారు వచ్చిన రెండు నెలలకు తెనాలి, మంగళగిరి ఎమ్మెల్యేలు విలేకరుల సమావేశం పెట్టిమరీ ఆర్భాటంగా ప్రకటించారు. ఆ నిధు లు ఇప్పటివరకు



అంగలకుదురు-దండమూడి మధ్య సగం పనులు జరిగితే అదికూడా ప్రస్తుతం గుంతలతో మారిన చిత్రం

ఏవ ంయ్యాయె నా తెలియదు. రోడ్డు అభివృద్ధి అటుం చితే, నందివెలుగు- రేవేంద్రపాడు మధ్య రోడ్డు దారు ణంగా తయారైంది. గుంతలుపడి, కుంగి, వాహనాలు కాలువలలోకి దూసుకు పోతున్న పరిస్థితి. గతంలో కార్లు కాల్వలోకి బోల్తాకొట్టి పదుల సంఖ్యలో ప్రాణాలు పోయిన పరిస్థితి ఉంది. రూ.264 కోట్లతో అభివృద్ధి అటుం చితే, అసలు మరమ్మతులకు కూడా దిక్కులేకుండా పోయింది. ఇదే రహదారి వెంట ప్రజాప్రతినిధులు వెళుతూనే ఉంటారు. వి.ఎస్.ఆర్ కళాశాల దగ్గర నుంచి ఆటో నగర్ వరకు రోడ్డు తూర్పు కాల్వవైపు పూర్తిగా దెబ్బతింది. మధ్యలో డివైడర్‌లు ఉండటంతో విజయవాడ నుంచి తెనాలి వైపునకు వచ్చే ప్రజాప్రతినిధులు తమ వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా కుడివైపు రోడ్డుపైకి మళ్లించటం విశేషం. దుగ్గిరాల- రేవేంద్రపాడు మధ్య ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేనంత దారుణంగా రోడ్డు తయారైందంటే దీనిపై శ్రద్ధ ఏపాటిదో అర్థమవుతుంది. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రాజీనామా చేసిన తర్వాత ఇదే రోడ్డుపై ప్రస్తావన కూడాచేశారు. కనీసం దుగ్గిరాల వరకు రోడ్డుకూడా వేయలేకపోయానని, ఇది సిగ్గుగా ఉందని చెప్పారంటే ప్రభుత్వ వైఫల్యం ఏమేర ఉందనేది అర్థమవుతుంది.

చేబ్రోలు బ్రిడ్జికి గ్రహణం వీడేనా!

కొమ్మమూరు కాల్వపై చేబ్రోలు దగ్గర హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి 2019లోనే రూ.25కోట్లు మంజూరు చేశారు. ఈ వంతెన బ్రిటీష్ కాలంనాటిది కావటం, అప్పటినుంచి తాత్కాలిక మరమ్మతులు చేసుకుంటూవచ్చినా, శిథిల స్థితికి చేరుకోవటం, హైలెవల్‌లో ఉండటంతో భారీ వాహనాలు అదుపుతప్పి కాల్వలోకి దూసుకుపోవటం వంటి ఘటనలు చాలానే జరిగాయి. అప్పట్లో ఈ పాత వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలి. అయితే అప్పట్లో జల రవాణా కింద ప్రధాన కాల్వ కింద ఇది ఉండటంతో నీటిపారుదల శాఖ అభ్యంతరం చెప్పింది. ఒకవేళ నిర్మిస్తే జల రవాణాకు సంబంధించి కాల్వ ఎంత వెడల్పు చేయాలనే ప్రతిపాదన ఉందో అంత వెడల్పు, కేంద్రం సూచించిన ఎత్తులో వంతెన నిర్మించుకుంటే అభ్యంతరం లేదని తేల్చి చెప్పటం, ఆ ప్రతిపాదనలు మళ్లీ రివైజ్ చెయ్యాల్సిరావటంతో అత్యవసరం కింద ప్రస్తుతం రూ.50 లక్షలతో ఇనుప గడ్డర్ల సాయంతో బయిలీ వంతెన నిర్మించాలని ఆర్‌అండ్‌బీ నిర్ణయించింది. దీనికోసం అప్పట్లో ఇనుప గడ్డర్లు తీసుకొచ్చినా వాటినీ నిర్మించకుండా వదిలేశారు. అప్పటి నుంచి దీని నిర్మాణానికి కొర్రీలు పడుతుండటం, జగన్ సర్కారు వచ్చాక కొత్త వంతెన నిర్మించటానికి 2023లో రూ.35కోట్లు మంజూరు చేయటం జరిగిపోయాయి. అయితే ఈ నిధులతో పనులు మొదలుపెడితే, మళ్లీ నీటిపారుదల శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే ఈసారి కాంట్రాక్టర్ నీటిపారుదల శాఖ అభ్యంతరాలను తోసిపుచ్చి నిర్మాణ పనులను మొదలుపెట్టేసింది. అయితే రెండువైపులా నాలుగు పిల్లర్లు వేసి, పనులు చేస్తున్నామనిపిస్తున్నారు. దీనికోసం ఏకంగా బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని రైతుల పంటలకు నీటిని, తాగునీటిని ఆపేసి మరీ పనులు చేపట్టారు. అప్పట్లో రైతులు ఆందోళన చేయటంతో చివరకు పనులు మధ్యలోఆపి, నీటిని వదిలారు. ఇప్పుడు ఖరీఫ్ చివరి దశకుచేరి, రబీ సాగుకు నీటిని ఆపేశారు. దీనికితోడు పాత వంతె నకు అటో, ఇటో కొత్త వంతెన నిర్మించటం సహజం. అయితే అక్కడ ఇబ్బందులు, సాధ్యాసాధ్యాలను పరిశీలించాకే నిర్మాణ పనులు మొదలుపెడతారు. కానీ ఇక్కడ పొన్నూరు ఛానల్ ఉంటే, దాని కల్వర్టును మూసేసి మరీ వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కాల్వ ద్వారా పొన్నూరు మండలంలోని 8 గ్రామాల పరిధిలోని పొలాలకు నీరు అందుతుంది. ఈ కాల్వను పూర్తిగా మూసేశారు. అయితే దీనిపై నీటిపారుదల శాఖ మాత్రం ఏ అభ్యంతరం చెప్పకుండా, రైతులు గోల పెడుతున్నా పట్టించుకోకుండా వదిలేసింది. వంతెన నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు తీసుకోకపోవటం, నిర్మాణ సమయంలో ఇతర ఇబ్బందులను పట్టించుకోకపోటం విశేషం. 2023లో రూ.35 కోట్లు మంజూరుచేసినా పనులు మాత్రం భూమిలో పిల్లర్ల వరకే పరిమితమయ్యాయి. ఈ వంతెన విషయంలోనూ గందరగోళ పరిస్థితులు నెలకొన్నా అన్నీ గాలిలో పెట్టేశారు. అన్నీ లోపభూయిష్టంగా తయ్యాయి.



తెనాలి-విజయవాడ రోడ్డులో ఆటోనగర్ దగ్గర మూడేళ్ల క్రితం గోడలు నిర్మించి రోడ్డు పనులు చేయకుండా వదిలేసిన చిత్రం

గత ప్రభుత్వ కాలంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పలు రోడ్లకు భారీగానే నిధులు మంజూరు చేసింది. తెనాలి మండలం అంగలకుదురు నుంచి పొన్నూరు మండలం దండమూడి మధ్య రోడ్డు 8.7 కి.మీటర్లు వేసేందుకు 2017లో రూ.10 కోట్లు మంజూరు చేశారు. అంగలకుదురు నుంచి చుండూరు మండలం వలివేరు అవతల వరకు 8.7 కి.మీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయితే దీనిలో ఇప్పటి వరకు కేవలం 51 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఐదేళ్ల క్రితం 5 కి.మీ తారురోడ్డు వేసి వదిలేశారు. ఆ తర్వాత ప్రస్తుత సీఎం జగన్ పర్యటన ఉండటంతో వలివేరు దగ్గర కొంతమేర బి.ఎం మిక్స్‌తో రోడ్డు వేసి చేతులు దులుపుకొన్నారు. అయితే ఈ పనులకు మరో బిల్లు నొక్కేశారు. ఇంకా సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం ఉంటే వాటిని వదిలేశారు. తెనాలి నుంచి చందోలు వెళ్లే రోడ్డు వేయటానికి 2017లో రూ.8 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో అమృతలూరు మండలంలోని మండూరు వంతెన దగ్గర నుంచి పెదపూడి వంతెన వరకు నిజాంపట్నం కాల్వలోకి రోడ్డు కుంగి ఊబిలోకి దిగిపోయింది. యలవర్రు వంతెన దగ్గరా రోడ్డు దెబ్బతినిపోయింది. రోడ్డుకు ఇరువైపులా తూర్పు కాల్వ, నిజాంపట్నం కాల్వలు ఉండటంతో కాల్వల అంచుల వెంట గోడ నిర్మించాల్సిఉంది. దీనిలో ఇప్పటివరకు కేవలం రూ.3.5 కోట్ల పనులు మాత్రమే చేయగలిగారు. కొద్దిమేర గోడ నిర్మించారు. మరికొంత తారు రోడ్డు వేశారు. అయితే పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేయటానికి అవసరమైన మిగిలిన నిధులను వైసీపీ సర్కారు మంజూరు చేయకపోవటంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో లారీల దగ్గర నుంచి కార్లవరకు మార్గంలో కాల్వలోకి బోల్తాపడుతున్నాయి. రెండు కి.మీ మేర రోడ్డు మధ్యకు బద్దలుగా పగిలిపోయి భూకంపం వచ్చిన ప్రాంతాల్లో ఉన్న ట్టుగా కిందికి కుంగిపోయింది. ఇంతటి ప్రమా దకరంగా ఉన్నా జగన్ సర్కారు మాత్రం వీటిగోడు పట్టించుకున్నదే లేదు. పొన్నూరు మండలం నిడమర్రు నుంచి అమృ తలూరు మండలం ప్యాపర్రు వరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ.2.5 కోట్లు కేటాయించారు. ఈపనులు 2023 నాటికే పూర్తి కావలసి ఉంటే ఇప్పటికి 5 శాతం పనులు కూడా పూర్తికాలేదు.దీనికీ నిధుల గ్రహణమే.



అతిసారం.. @ 221

- గుంటూరులో మరో 221 మంది అతిసార బాధితులు గుర్తింపు
- నీరసించిన 24 మంది జీజీహెచ్‌కు తరలింపు
- ప్రభావిత ప్రాంతాల్లో ఏడు వైద్య శిబిరాలు
- ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే
- హెల్త్ బులిటెన్ నిలిపివేసిన ఆసుపత్రి వర్గాలు
- వైద్యసాయం కోసం కంట్రోల్ రూం ఏర్పాటు



బాధితుడిని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

గుంటూరు(మెడికల్), ఫిబ్రవరి 13: గుంటూరు నగరంలో డయేరియా ప్రబలిన శారదా కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, లాంచెస్టర్ రోడ్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఒక్కరోజే కొత్తగా 223 అతిసారం కేసులు వెలుగు చూశాయి. ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన 35 ప్రత్యేక బృందాలు ఇంటింటి సర్వే నిర్వహించి ఈ కేసులను గుర్తించాయి. వీరిలో 116 మంది బాధితులకు ఇళ్ల వద్దే ఆరోగ్య సిబ్బంది చికిత్స అందించారు. అవసరమైన 83 మందికి పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో చేర్పించి చికిత్సలు అందిస్తున్నారు. బాగా నీరసంగా ఉన్న 24 మంది రోగులను మెరుగైన వైద్యసేవలు కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. మరో పక్క గత మూడు రోజులుగా అతిసారం బాధితుల వివరాలతో హెల్త్ బులెటిన్ విడుదల చేస్తున్న గుంటూరు జీజీహెచ్ అధికారులు పై స్థాయి నుంచి వచ్చిన ఒత్తిడితో మంగళవారం బులెటిన్ విడుదల చేయలేదు. దీంతో రోగుల ఆరోగ్య పరిస్థితిపై సరైన సమాచారం అందటం లేదు.

వైద్య శిబిరాలు..

నగరంలో డయేరియా ప్రబలిన శారదా కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, లాంచెస్టర్ రోడ్ తదితర ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అతిసార నియంత్రణకు ఏడు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. శారదా కాలనీలో మూడు వైద్య శిబిరాలు, ఇందిరా ప్రియదర్శిని కాలనీలో రెండు శిబిరాలు, లాంచెస్టర్ రోడ్ పరిధిలో మరో రెండు వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య సాయం కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ (ఫోన్ నెంబర్లు: 83413 96104, 72075 95104) ను సంప్రదించి బాధితులు తగిన సాయం పొందవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ వెల్లడించారు.

డయేరియా నివారణపై విస్తృత ప్రచారం...


మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో 35 ప్రత్యేక బృందాలకు వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి. రమేష్, డాక్టర్ నిర్మల గ్లోరీ, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, క్లోరిన్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు, కరపత్రాలు ఉన్న కిట్లను, బ్యానర్లను అందజేశారు. అనంతరం ఈ బృందాలు డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో అతిసారం నివారణపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. రక్షిత మంచి నీటిని ప్రజలు వినియోగించాలని, మరగ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడిగా ఉన్న ఆహారాన్ని భుజించాలని, కుళ్లిన పండ్లు, ఆహార పదార్థాలను దూరంగా ఉంచాలని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అవసవరమైన వారు ఇంటి దగ్గర లభించే ద్రవపదార్థాలు, ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు వాడాలని వారు సూచించారు.

నగరంలో పానీ పూరీని బ్యాన్ చేయండి

- రీజనల్ వాటర్ ల్యాబ్ సూచన

గుంటూరు నగరంలో డయేరియా, టైఫాయిడ్ వంటి అనారోగ్యాలకు కారణమౌతున్న పానీపూరిని నిషేధించాలని గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని ప్రాంతీయ నీటి పరిశోధన శాలకు చెందిన సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్ట్ డాక్టర్ జి.శోభారాణి, మంగళవారం గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరికి లేఖ రాశారు. పానీపూరి వల్ల తరచూ డయేరియా, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నట్లు ఆమె తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రబలిన డయేరియాకు పానీపూరి నేరుగా కారణం కాకపోయినప్పటికీ, ఇటీవల నగరంలో పలుచోట్ల ఏర్పడిన చిన్నస్థాయి ఔట్‌బ్రేక్‌లకు పానీపూరినే కారణమని తమ పరిశోధనలో తేలిందని డాక్టర్ శోభారాణి పేర్కొన్నారు.

పోటెత్తిన మిర్చి



యార్డులోకి భారీగా చేరిన మిర్చి లారీలు

- ఒకే రోజున 2.50 లక్షలకు పైగా మిర్చి టిక్కీల రాక
- యార్డులో దిగుమతి చేసే పరిస్థితి లేక రోడ్లపై బారులుతీరిన లారీలు
- గంటల తరబడి గుంటూరు - హైదరాబాద్ రహదారిపై ట్రాఫిక్ జామ్
- నేడు మిర్చియార్డులో దిగుమతుల బంద్

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చిలోడు లారీలు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)కు పోటెత్తాయి. వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు, ఆటోలలో మిర్చి టిక్కీలు లోడింగ్ చేసి రైతులు విక్రయానికి తీసుకురావడంతో యార్డు కిక్కిరిసిపోయింది. ఇంచుమించు రెండున్నల లక్షల మిర్చి టిక్కీలకు పైగా ఒకేరోజు రావడంతో యార్డులోకి ప్రవేశించే అవకాశమే లేకపోయింది. దాంతో మంగళవారం వేకువజామున 3 గంటల నుంచే గుంటూరు - హైదరాబాద్ రోడ్డులో ఒకవైపు మిర్చిలారీలు నిలిచిపోయాయి. మిర్చియార్డు గేటు నుంచి దాదాపుగా కిలోమీటర్ దూరం వరకు లారీలు మూడు వరసల్లో బారులు తీరడంతో ట్రాఫిక్ స్తంభించిపోయి సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిని పరిగణన లోకి తీసుకొన్న మార్కెట్ కమిటీ పాలకవర్గం, అధికారులు మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు యార్డులోకి సరుకు దిగుమతిని అనుమతించకూడదని నిర్ణయించారు. బుధవారం రాత్రి నుంచి తిరిగి సరుకు అనుమతిస్తామని ప్రకటించారు.

ఈ ఏడాది మిర్చి సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి నిత్యం లక్షన్నర మిర్చి టిక్కీలకు పైగా రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు. మంగళవారం కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా రైతులు సరుకు తీసుకొచ్చారు. మరోవైపు రాయలసీమ, పల్నాడు, గుంటూరు జిల్లాల రైతులు కూడా మిర్చి టిక్కీలు తీసుకురావడంతో యార్డులో అన్ని ప్లాటఫాంలు నిండిపోయాయి. ఈనామ్‌లో ట్రేడింగ్ జరిగిన సరుకు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఎటు చూసినా మిర్చి టిక్కీలే కనిపిస్తున్నాయి.

కాగా మిర్చియార్డు వద్ద ట్రాఫిక్ స్తంభించినప్పటికీ క్లియర్ చేసేందుకు అటు పోలీసులు, ఇటు సెక్యూరిటీ గార్డులు ఏమాత్రం ప్రయత్నించలేదు. దీని వలన గుంటూరు - హైదరాబాద్ మార్గంలో బస్సులు గంటకు పైగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. ఉదయం 8 గంటల తర్వాత పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ని రోడ్డుకు ఒక వైపునకు మళ్లించడంతో కొంతవరకు సమస్య పరిష్కారం అయింది. దీనిపై యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి మిర్చి టిక్కీలను రైతులు ఇక్కడికి తీసుకొస్తున్నారు. వరంగల్, ఖమ్మం మార్కెట్లలో ఏదో సమస్య తలెత్తినట్లు తమకు సమాచారం ఉందన్నారు. అందుకే నిత్యం 3 వేల మందికి పైగా రైతులు ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. సరుకు ఎక్కువగా వస్తే ధర తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ఒకేసారిగా కాకుండా విడతల వారీగా మిర్చి టిక్కీలను యార్డుకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

తీర్మానం.. తూచ్!

- మంగళగిరిలో ఓ భవనానికి వైఎస్ఆర్ పేరు పెట్టాలని గతంలో తీర్మానం
- ఆళ్ల కాంగ్రెస్‌లో చేరారని.. వైఎస్ఆర్ పేరు లేకుండా చేసే యత్నం
- మున్సిపాలిటీ తీర్మానం చేసినా తోసేసి భవనం ప్రారంభోత్సవం
- వైసీపీని వీడిన ఎమ్మెల్యే ఆళ్ల తిరుగుబాటుతో సరిదిద్దేందుకు యత్నం

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మంగళగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి వైసీపీని వీడి కాంగ్రెస్‌లో చేరటంతో ఆ నియోజకవర్గ రాజకీయాలు వేడెక్కాయి. ఆయన వైసీపీలో మమేకమై ఉన్న సమయంలో చేనేత వ్యాపార సముదాయం కోసం ఓ భవనాన్ని నిర్మించాలని భావించారు. ఇందుకోసం 27 సెంట్ల ప్రభుత్వ భూమిని ఎంపిక చేశారు. వాస్తవానికి ఆ స్థలం జిల్లా పరిషత్‌ది కాగా ఆర్టీసీ సంస్థది. ఆ భూమిని లీజుకు తీసుకొని ఉపయోగించకపోవటంతో దాన్ని స్వాధీనం చేసుకొని ఎమ్మెల్యే ఆళ్ల భవన నిర్మాణానికి తన ఆధ్వర్యంలో అప్పట్లో శంకుస్థాపన చేశారు. ఆ భవనానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు, చేనేత పితామహుడు ప్రగడ కోటయ్యల పేర్లు కలిపి పెట్టాలని ఆళ్ల భావించారు. శంకుస్థాపన అనంతరం మున్సిపాలిటీలో ఆ భవనానికి పేరు పెడుతూ తీర్మానం చేయించారు. డాక్టర్ వైఎస్ఆర్, ప్రగడ కోటయ్య హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ ట్రేడ్ కాంప్లెక్స్ అని నామకరణం చేశారు. పాత బస్టాండ్ ప్రాంగణంలో నిర్మించిన ఈ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. అయితే గత తీర్మానానికి అనుగుణంగా ఆ భవనానికి పేరు పెట్టకుండా అందులోనుంచి వైఎస్ఆర్ పేరును తొలగించి కేవలం ప్రగడ కోటయ్య హ్యాండ్లూమ్స్ టెక్స్‌టైల్ ట్రేడ్ కాంప్లెక్స్‌గానే పేర్కొంటూ ఆహ్వాన పత్రాలు ముద్రించి ముందుగా పంపిణీ చేశారు. ఈ ఆహ్వానపత్రం చూసిన ఎమ్మెల్యే ఆళ్ల అధికారులపై తిరుగుబాటు చేశారు. తమకు ఇందులో ఎటువంటి సంబంధం లేదని వైసీపీ నేతల సూచనతోనే ఇలా చేశామని వారు సమర్థించుకున్నారు. దీంతో ఆళ్ల మంగళగిరి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుకు ఫోన్ చేసి వైఎస్ఆర్ పేరు ఎందుకు తొలగించారని మండిపడటంతో పాటు వైఎస్ఆర్ పేరు చేర్చకపోతే స్థానిక ఎమ్మెల్యేగా తాను భవనం ఎదుట ధర్నా చేస్తానని హెచ్చరించారు. దాంతో అప్పటికప్పుడు వైఎస్ఆర్ పేరు చేర్చి కొన్ని ఆహ్వానపత్రాలు ముంద్రించి పంపిణీ చేశారు. శిలాఫలకం మాత్రం వైఎస్ఆర్ పేరు లేకుండానే వేసేశారు. రెండు రోజుల్లోగా వైఎస్ఆర్ పేరు చేర్చి శిలాఫలకం మార్చాలని ఎమ్మెల్యే ఆళ్ల అధికారులకు, మంగళగిరి ప్రాంత వైసీపీ నేతలకు అల్టిమేటం జారీ చేశారు. ఈ వివాదం చివరికి ఏ పరిణామాలకు దారి తీస్తుందో వేచి చూడాలి.

ఆర్కే గొడవ చేయటంతో అప్పటికప్పుడు వైఎస్ఆర్ పేరు చేర్చి ముద్రించిన కొన్ని ఆహ్వానపత్రాలు



వైఎస్ఆర్ పేరు లేకుండా ఏర్పాటుచేసిన శిలాఫలకం



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

నాలుగున్నరేళ్లు నయవంచన పాలన

● 1519వ రోజుకు చేరిన రాజధాని రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 13: రాష్ట్ర ప్రజలు సీఎం జగన్‌రెడ్డిని నమ్మే పరిస్థితిలో లేరని రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1519వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, అధికారం చేపట్టబోయేముందు అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పావు.. ఎక్కడ, ఏదీ అని ప్రశ్నించారు. పోలవరం 2022 నాటికి పూర్తి చేస్తానని అన్నావు.. ఎక్కడ..? ప్రత్యేక హోదా తెచ్చి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని అన్నావు.. ఏదీ.. ఎక్కడ.. ఇంకెప్పుడూ? అంటూ ప్రశ్నించారు. నాలుగున్నర ఏళ్లుగా నయవంచనతో పరిపాలన చేశావు.. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను ఇరవై సంవత్సరాలు వెనక్కి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ స్వలాభం కోసం కక్షతో అమరావతిని మూడుముక్కల ఆటతో నిర్వీర్యం చేశారని ఆరోపించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. తుళ్ళూరు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి, అనంతవరం, నెక్కల్లు, తదితర రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

ఐదేళ్లుగా రాష్ట్రంలో అరాచక పాలన

● శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

పిడుగురాళ్ళ, ఫిబ్రవరి 13: ఐదేళ్లుగా ఏపీలో అరాచకపాలన సాగుతోందని, ఒక్కచాన్స్ అంటూ మాయమాటలు చెప్పి మన ఓట్లు గుంజేసుకున్న జగన్ మైనారిటీలను దగా చేశాడని శాసనమండలి మాజీ చైర్మన్ అహ్మద్ షరీఫ్ అన్నారు. మంగళవారం రాత్రి పిడుగురాళ్లలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గస్థాయి మైనారిటీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ 100 రూపాయలకు బటన్ నొక్కి వెయ్యిరూపాయలు లాగేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరలో పడ్డాయన్నారు. గురజాల నియోజకవర్గంలో ముస్లింలపై దాడులు జరిపిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఓటు వేయొద్దన్నారు. పల్నాడు ప్రాంతానికి గుండెకాయ లాంటి యరపతినేని ముస్లిం మైనారిటీలకు అండగా వుండటం మీ అందరి అదృష్టం. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ వైసీపీ హయాంలో ముస్లిం మైనారిటీలకు ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదలచేయాలని డిమాండ్ చేశారు. యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక గురజాల నియోజకవర్గంలో మైనారిటీలపై ఎన్నో దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగాయని గుర్తుచేశారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో ఏ మైనారిటీ కుటుంబానికైనా, హజ్‌యాత్రకు వెళ్లే వారికెవరికైనా రూ.5 వేలు కాసు మహేష్‌రెడ్డి అందించాడా? అలా వుంటే వారి పేరు చెప్పాలన్నారు. గురజాలలో అవినీతి సంపాదనకు అలవాటుపడిన కాసును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎన్నికల్లో ఏడవ సారి గురజాల నుంచే పోటీ చేయనున్నట్లు యరపతినేని స్పష్టం చేశారు. మైనారిటీలకు తానెప్పుడూ అండగా వుంటానని, పిడుగురాళ్లలో ఓ మైనారిటీ కుటుంబంలో కుమారులు ఇద్దరు చనిపోగా, ఆ కుటుంబానికి పెద్దబిడ్డగా వుంటానని ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షలు అందించి ఆ తల్లికి పాదాబివందనం చేసిన విషయాన్ని యరపతినేని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు నాయబ్ కమాల్, ఎండీ నజీర్, నసీర్ అహ్మద్, బాబావలి, అమీర్‌అలితో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.



ముస్లిం మైనారిటీ ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ అహ్మద్ షరీఫ్, పక్కన మాజీ ఎమ్మెల్యే యరపతినేని తదితరులు



శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులను గజమాలతో సత్కరిస్తున్న మైనారిటీ సోదరులు

దొరక్కుండా.. దాచేశారు..

- నిన్నటి వరకు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ఎన్జీటీ ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్ శివశంకర్
- ముందస్తు సమాచారంతో క్వారీయింగ్ నిలిపివేత
- ఎక్స్‌కవేటర్లను దాచేశారు..
- ఇసుక అక్రమ క్వారీయింగ్ అడ్డుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

అమరావతి, అచ్చంపేట, ఫిబ్రవరి 13: ఎన్జీటీ ఆదేశాల మేరకు కలెక్టర్ శివశంకర్ లోతేటి మంగళవారం పెదకూరపాడు నియోజకవర్గంలోని మల్లాది, కోనూరు గ్రామాల్లో ఉన్న ఇసుకరీచ్‌లను మైనింగ్, పొల్యూషన్, రెవిన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. నదీతీరం వెంబడి ఇసుక రీచ్‌లలో జరుగుతున్న ఇసుక అక్రమ క్వారీయింగ్, రవాణాకు సంబంధించి వివరాలను సేకరించి రిపోర్టు ఇవ్వాలని ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాల మేరకు కలెక్టర్ రీచ్‌లను సందర్శించారు. కలెక్టర్ రీచ్‌ల పరిశీలనకు వచ్చిన సమయంలో ఇసుక అక్రమార్కులు ఎక్స్‌వేటర్‌లను సమీపంలోని పొలాల్లో దాచి క్వారీయింగ్‌ను నిలుపుదల చేశారు. మైనింగ్ అధికారి ఇసుక క్వారీయింగ్‌కు అనుమతులు లేవని ఎక్కడా ఇసుక అక్రమ రవాణా జరగడంలేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రీచ్‌లో ఇసుక వాహనాలు తిరిగినట్లు కనిపించడం, నిత్యం ఇసుకక్వారీయింగ్ జరుగుతుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్ స్పందించారు. మండల అధికారులు తమ పరిధిలో క్వారీయింగ్‌కు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మైనింగ్ ఏడీ నాగిణి, పొల్యూషన్ కంట్రోల్ అధికారితో పాటు ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ రమణారావు, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో జి.రాణి, కుసుమకుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మల్లాది రీచ్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

ముందస్తు సమాచారంతో...

ఇసుక రీచ్‌లను పరిశీలించేందుకు జిల్లా అధికారులు వస్తున్న సమాచారం అక్రమార్కులకు తెలియడంతో మండలంలోని వైకుంఠపురం, మల్లాది గ్రామాల్లో జరుగుతున్న ఇసుక క్వారీయింగ్, అక్రమరవాణా మంగళవారం నుంచి నిలిచిపోయింది. నిత్యం వందలసంఖ్యలో భారీవాహనాల్లో ఇసుక తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా మండలస్థాయి అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడలేదు. దొంగబిల్లులతో ఇసుక ఓవర్‌లోడుతో వెళుతున్న వాహనాలపై పర్యవేక్షణ కూడా లేదు. అక్రమ క్వారీయింగ్ అడ్డుకుంటే అధికారపార్టీ నాయకుల నుంచి బెదిరింపులకు గురికావాల్సివస్తుందని మండల, గ్రామస్థాయి అధికారులు అడ్డుకునేయత్నం చేయలేదని తెలుస్తోంది. హైకోర్టు అక్రమక్వారీయింగ్‌పై సీరియస్‌గా ఉండటంతో ఇప్పటికి జిల్లా అధికారులు కళ్లుతెరిచారని స్థానికులు అంటున్నారు.

వైసీపీ ప్రచార సభగా ఆసరా చెక్కుల పంపిణీ



ఆసరా చెక్కు పంపిణీ సభలో మాట్లాడుతున్న గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి ఉమ్మారెడ్డి వెంకటరమణ

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి13: ఆసరా చెక్కుల పంపిణీ ప్రభుత్వ కార్యక్రమాన్ని వైసీపీ ఎన్నికల ప్రచార సభగా మార్చడం పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. పొన్నూరు పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సభ నిర్వహించారు. ఈ వేదికపై స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యతోపాటు ఆయన బావమరిది వైసీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి ఉమారెడ్డి వెంకటరమణ, వైసీపీలో కీలక పదవుల్లో ఉన్న పలువురు నాయకులు ఆసీనులై ప్రసంగించారు. వెంకటరమణ మాట్లాడుతూ గుంటూరు ఎంపీగా తనను, పొన్నూరు ఎమ్మెల్యేగా తన బావమరిది కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని మహిళలకు విజ్ఞప్తి చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎన్నికల ప్రచార సభలా నిర్వహించారని మహిళలు మండిపడుతున్నారు. అధికారులు కూడా రాజకీయ పార్టీకి వత్తాసు పలికేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఇసుక అక్రమాలపై వైసీపీలోనే తిరుగుబాటు



పెదకొండూరులో రీచ్‌ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కె.రవీంద్ర, ఎస్సై ప్రతాప్

దుగ్గిరాల, ఫిబ్రవరి13: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలో ఇసుక అక్రమంగా తరలివెళుతుందంటూ వైసీపీ నాయకులే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పెదకొండూరు రీచ్ నుంచి పెద్దఎత్తున్న అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారంటూ సాక్షాత్తూ జడ్పీటీసీ మేకతోటి అరుణకుమారి, గ్రామ ఎంపీటీసీ సుమన్‌తో కలిసి మంగళవారం స్థానిక తహసీల్దార్ కె.రవిబాబు, ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌లకు ఫిర్యాదు చేశారు. మైనింగ్ డీడీ దృష్టికి తీసుకెళ్లగా తమశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవని చెప్పారని జడ్పీటీసీ అరుణ అన్నారు. లారీల్లో భారీగా తరలిస్తున్నారని, రోడ్లుకూడా దెబ్బతిని పోతున్నాయని తక్షణమే చర్యలు తీసుకోకుంటే బుధవారం నుంచి గ్రామస్తులతో కలిసి అక్రమ క్వారీయింగ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతో తహసీల్దార్ రవిబాబు, ఎస్ఐతో కలిసి రీచ్‌వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అక్రమ మైనింగ్‌పై సొంత పార్టీనేతలే ఫిర్యాదు చేయడం పట్ల జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

చిలకలూరిపేటలో ప్రత్తిపాటి చాయ్‌పే చర్చా



టీ దుకాణం వద్ద మాజీ మంత్రి ప్రత్తిపాటి మాటా మంతి

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 13: ప్రచారమంటే తాము చెప్పేదే కాదు, ప్రజలు చెప్పేది.. వారి కష్టాలు వినటం.. వారి మనిషిగా మేమున్నాం అన్న భరోసా కల్పించటం అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పార్టీ తరుపున ప్రచారంలో భాగంగా పట్టణంలో తొలిసారి చాయ్‌పే చర్చా తరహాలో ఓ టీస్టాల్ వద్ద ఆగి స్థానికులతో మమేకమయ్యారు. బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమానికి వెళ్తున్న ప్రత్తిపాటి సీఆర్ కాలనీలో దోస్తీ కేఫ్ వద్ద ఆగి స్థానికులతో చర్చించారు. టీ విక్రయ దారులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, అనుభవాలు రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రజలు ఏం ఆశిస్తున్నారో వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారంగా మారిన నిత్యావసరాల ధరలు, ప్రభుత్వ పనులు, కరెంటు బిల్లులు భారంగా మారాయని ప్రత్తిపాటి వద్ద వాపోయారు. మరో రెండు నెలల్లో వాటన్నింటిని నుంచి ప్రజలకు విముక్తి లభిస్తుందని, సైకో సీఎం పీడ వదిలిపోతుందని ప్రత్తిపాటి తెలిపారు.

హత్యకేసులో 12మంది నిందితుల అరెస్టు



సమావేశంలో హత్య కేసుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

బాపట్లరూరల్, ఫిబ్రవరి 13: పాతకక్షల నేపథ్యంలోనే గోరంట్ల వెంకటసుమంత్ హత్య జరిగినట్లు బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఆరోతేదీన సుమంత్‌పై వినోద్, యాసిన్ మరో 10 మంది కర్రలతో దాడి చేశారు. అనంతరం వినోద్ కత్తితో పొడిచాడు. దీంతో సుమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి సుష్మాంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా 12మందిని అరెస్టు చేయటం జరిగిందన్నారు. ముద్దాయిలైన వినోద్, యాసిన్, సతీష్, అఖిల్, చిన్నవినోద్, ప్రవీణ్ బాబు, దాసు, శివసాయి, బాబు, మహేష్, అశోక్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా రౌడీషీటర్లపై నిఘా ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీసుస్టేషన్ పరిధిలో రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా డివిజన్ వ్యాప్తంగా 30యాక్ట్ పోలీసు అమలులో ఉందని తెలిపారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ శ్రీవిద్య, బాపట్ల సర్కిల్ సీఐ హజరత్‌బాబు, బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి, ఎస్ఐ రవి శంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విజ్ఞాన విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులతో శ్రీకూర్మనాథ్ తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13: ఐఐటీ జేఈఈ మెయిన్స్ పరీక్షలో విజ్ఞాన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల సమన్వయకర్త జి.శ్రీకూర్మనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన ఐ.హనీత్(99.67), ఎం.స్నేహ(99.46), రోహన్(98.48), కే లీలావతి (98.30), బీ యోగవిజయ్‌కుమార్(98.07), ఎస్.వెంకటగాయత్రి (96.32), ఏ దీపిక(95.78), టీ సంజయ్‌తేజ(94.71), పీ గౌతమ్(94.61), ఎం.నాగసాయి ప్రకాష్(93.66), వీ అభిరామ్(93.57), నాగ మానస(93.56), ఏ చంద్రిక(93.07), ఏ థాఫిల్ (93.50), జీ వైశాలి(92.76), సీ రేవంత్(92.11), జీ పుల్లారెడ్డి(92.05), వీ నందిని(91.60), వై.నాగకార్తికేయ(90.96) పర్సంటేజ్ సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, అధ్యాపకసిబ్బంది అభినందనలు తెలిపారు.

భారీ స్థాయిలో నగదు, బంగారం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 13: నరసరావుపేట సమీపంలో కాచిగూడ - గుంటూరు రైల్లో ఇరువురు వ్యక్తుల వద్ద నుంచి మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో రూ.11.14లక్షల నగదు, 391 గ్రాముల బంగారు ఆభరణా లను స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట రైల్వే ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ఉన్నతాధికా రుల సూచనల మేరకు అక్రమ ధనం తరలించటాన్ని అరికట్టడానికి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం కాచిగూడ - గుంటూ రు రైల్లో వినుకొండ నుంచి నరసరావుపేట వరకు తనిఖీలు నిర్వహిస్తుండగా విజయవాడకు చెందిన దోసపాటి మోహనరావు, గుజరాత్‌కు చెందిన ఆనంద్ కుమార్‌లు నగదు, బంగారాన్ని భారీస్థాయిలో కలిగి ఉన్నారన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని ప్రశ్నించగా సరైన ఆధారాలు చూపలేక పోయారన్నారు. వీరిరువురు విజయవాడలోని శాంతి జ్యూవెలర్స్‌లో పని చేస్తున్నారని, బంగారు వస్తువులను వినుకొండలో అందజేసి నగదును తీసుకువెళ్తున్నట్టు తెలిపారన్నా రు. నిందితులను అరెస్టు చేశామని, స్వాధీనం చేసుకున్న బంగారాన్ని, నగదును సంబంధిత అధికారులకు అందజేయనున్నట్టు వారు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శంకర్‌రెడ్డి మృతదేహం

మాచర్ల, ఫిబ్రవరి 13: విద్యుత్‌షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని రవి స్వీట్స్‌షాపు యజమాని శంకర్‌రెడ్డి (65) మంగళవారం పట్టణ శివారులోని రామప్ప ఆలయం వద్ద ఉన్న తన పొలానికి నీరుపెట్టేందుకు వెళ్లారు. మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

డీఏలను రికవరీ చేయడం చరిత్రలో తొలిసారి..

● వీఆర్ఏ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13: చరిత్రలో తొలిసారిగా డీఏ రికవరీ పేరుతో వీఆర్ఏల నుంచి పెద్దఎత్తున వసూలుచేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. మంగళవారం స్థానిక పాత గుంటూరులో సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి 2024 జనవరి నాటికి ఒక్కో వీఆర్ఏ రూ.21,900 డీఏ రూపంలో కోల్పోయాడని వివరించారు. ఇన్ని ప్రభుత్వాలు మారినా వీఆర్ఏలను ఇంత దారుణంగా దెబ్బ తీసిన ప్రభుత్వం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా వీఆర్ఏలందరిని మేల్కొల్పి పోరుబాట పట్టకపోతే వ్యవస్థకే నష్టంవచ్చే ప్రమాదం ఉందన్నారు. నామినీలను వీఆర్ఏలుగా గుర్తించడం, అర్హులైన వారందరికి పదోన్నతులు, ఇతర డిమాండ్ల సాధనకై ఈ నెల 18, 19, 20 తేదీలలో తలపెట్టిన రిలేదీక్షలలో వీఆర్ఏలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వై నేతాజీ, బి.లక్ష్మణరావు, షేక్ నాగులమీరా, రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

నడికుడి - గురజాల మధ్యన ఆర్‌యూబీ మూసివేత

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నడికుడి - గురజాల సెక్షన్ మధ్యన ఉన్న 87ఏ రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)ని 45 రోజుల పాటు మూసి వేయనున్నట్లు గుంటూరు రైల్వే డీఆర్‌ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు బ్రిడ్జి మూసివేసి ఉంటుందన్నారు. నడికుడి రైల్వేస్టేషన్‌లో కంటైనర్ ట్రాఫిక్ నిర్వహణ నిమిత్తం అదనపు లూప్‌లైన్ల నిర్మాణం కోసం ఆర్‌యూబీ 87ఏని పొడిగించాల్సి ఉందన్నారు. ఈ ఆర్‌యూబీ దాచేపల్లి-గోగులపాడు గ్రామాలను కలుపుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు దాచేపల్లి మీదగా మాచర్ల రహదారికి చేరుకోవచ్చని సూచించారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాడికొండ, ఫిబ్రవరి 13: తాడికొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల(బాలుర)లో 5వ తరగతిలో చేరు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.మరియదాసు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 80 సీట్లు ఉన్నాయన్నారు. ఎస్సీ-60, బీసీ-సీ 10, ఎస్టీ-5, బీసీ-4, ఓసీ-1 సీట్లు ఉన్నట్లు తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నివసించేవారు ఈనెల 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9948138872 నెంబరులో సంప్రదించాలన్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,49,013 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,37,129 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 1,01,807టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర	వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	13500	17300
			నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
334	8000	20500	తేజ	8000	21500
నెంబరు. 5	9000	20000	బ్యాడిగి	10000	21000
273	13500	20500	దేవనూరుడీలక్స్	11000	20000
341	10000	21500	తెల్లకాయలు	5500	12000
4884	13000	18000			

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని..

● కన్న కూతుర్ని ప్రియుడితో కలిసి చంపిన తల్లి

తాడికొండ, ఫిబ్రవరి 13: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని తల్లి తన ప్రియుడితో కలిసి కన్న కూతుర్ని(6) కొట్టిచంపిన సంఘటన తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన కొణతాల సిద్దార్థ హైదరాబాద్‌లో కూలీ పనుల చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. హైదరాబాద్‌లోని లాల్‌గూడకు చెందిన జనగాల స్వప్నకు సిద్దార్థతో పరిచయం ఏర్పడింది. స్వప్న ఓ బట్టల దుకాణంలో పనిచేస్తోంది. అమెకు భర్త, కుమార్తె(6) ఉన్నారు. సిద్దార్థ, స్వప్నల మధ్య కొంతకాలంగా వివాహేతర సంబంధం నడుస్తోంది. దీంతో ఇద్దరు కలిసి మూడు నెలల క్రితం హైదరాబాద్ నుంచి పారిపోయి అక్కడక్కడ తలదాచుకుంటున్నారు. 25 రోజుల క్రితం తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి వచ్చారు. ఇదే గ్రామంలో గుడారం వేసుకుని మిరపకోత పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారి వివాహేతర సంబంధానికి కుమార్తె అడ్డుగా ఉందని భావించి ఐదు రోజుల క్రితం చిన్నారిని కొట్టి చంపేశారు. పక్కనే ఉన్న రైల్వే ట్రాక్ వద్ద మృతదేహాన్ని పెట్రోల్ పోసి కాల్చివేశారు. అప్పటినుంచి ఇద్దరు పారిపోయారు. రైల్వేట్రాక్ వద్ద మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.36 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

ల్యాండ్ టైటిల్లింగ్ చట్టాన్ని రద్దు చేయాలి : నసీర్


న్యాయవాదులకు సంఘీభావం తెలుపుతున్న నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక ల్యాండ్ టైటిల్లింగ్ యాక్టును రద్దు చేయాలని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా కోర్టు సముదాయం ఎదుట 44 రోజులుగా జరుగుతున్న రిలే దీక్షలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఆందోళన చేస్తున్న న్యాయవాదులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక చట్టం రద్దయ్యే వరకూ ఉద్యమానికి అన్నివిధాలా అండగా ఉంటానని ఆయన వారికి హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే చీకటి జీవోలను రద్దు చేస్తామని చెప్పారు. దీక్షకు సంఘీభావంగా కేవీకే సురేశ్, వంశీకృష్ణ, విజయరాజు, కొల్లి శంకర్రావు, బ్రహ్మానంద రెడ్డి, అంకమ్మ చౌదరి, చిగురుపాటి రవీంద్రబాబు, వరప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచినీరు అందించలేని వైసీపీ

● డేగల ప్రభాకర్



గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచినీరు అందించడంలో వైసీపీ ప్రజా ప్రతినిధులు, గుంటూరు నగరపాలక సంస్థ పూర్తిగా వైఫల్యం చెందిందని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ ఆరోపించారు. పార్టీ నగర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంచినీరు కలుషితమై ప్రజలు డయేరియా బారిన పడుతుంటే అధికారులకు, వైసీపీ ప్రజాప్రతినిధులకు కనీసం చీమకుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. పది రోజులుగా కలుషిత నీరు తాగి అనారోగ్యంతో వేలమంది ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరినా, ఇద్దరు చనిపోయినా ముఖ్యమంత్రి తనకు సంబంధం లేదన్నట్టు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. రోజు రోజుకి డయేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, అయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం చాలా దారుణమన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

కనీసం తాగునీరు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం

● పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర



గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో చెత్త మీద కూడా పన్నులు వేసి పేదల సొమ్మును లూటీ చేస్తున్న వైసీపీ ప్రభుత్వం నేడు ప్రజలకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెల మూడి రవీంద్ర (నాని) ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరు నగరంలో మంచి నీరు కలుషితమై అధికారికంగా ఇద్దరు, అనధికారికంగా 10మంది చనిపోయారని, అయినా ఈ దద్దమ్మ జగన్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, మంత్రులు ఎవరూ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. చనిపోయిన వారి పట్ల సానుభూతి, కనీస బాధ్యత లేకుండా 'హెల్త్ ఎమర్జెన్సీ' వస్తే స్పందిస్తామని ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పటం అత్యంత హేయమన్నారు. ఎమర్జెన్సీ వచ్చే వరకూ ప్రజలను ఏమి చేయదలచారని నిలదీశారు. మంత్రి రజిని వైద్య ఆరోగ్య శాఖ మీద దృష్టి సారించి, ఇటు వంటి సంఘటనలు జరగకుండా సమీక్షలు చేయాలి. అంతా అయిపోయిన తరువాత నటిస్తే ప్రజల ఆగ్రహానికి గురి కాకతప్పదు అని ఆయన హెచ్చ రించారు. చనిపోయినవారి కుటుంబాలకు 50 లక్షల రూపాయలు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

క్రీడల్లో ఏసీ కళాశాల విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోజెస్ తదితరులు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 13: స్థానిక ఆంధ్ర క్రైస్తవ కళాశాల విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజస్, వైస్ ప్రిన్సిపాల్ ప్రీతమ్ ప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆర్ దివ్యశ్రీ 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ కనపరచింది. జనవరి 24వ తేదీన సత్తెనపల్లిలోని వావిలాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విన్నర్‌గా విజయం సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా జనవరి 31వ తేదీన నరసరావుపేటలోని కోడెల ఇండోర్ స్టేడి యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో రన్నర్‌గా విజయం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ కె.మోజస్, వ్యాయామ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రీతం ప్రకాష్, బీ విజయకుమార్ తదితరులు అభినందించారు.

పాఠశాలల్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్‌జేడీ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13: పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.లింగేశ్వర్‌రెడ్డి గుంటూరు, తెనాలి ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల ల్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుంటూరులోని పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెనాలి పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సందర్శించి ఒకటి, మూడో తరగతి విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం వచ్చే విధంగా ఉండాలని, పాఠశాలల్లో విద్యాబోధన ఐఎఫ్‌బీ ప్యానల్స్ ఉపయోగించి చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులయ్యే విధంగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఎంఈవోలు ప్రధానోపాధ్యాయులు, నిరంతరం పాఠశాలను పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి ఉపవిద్యాశాఖ అధికారి ఎం నిర్మల, వివిధ మండలాల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియా లక్షణాల వారి సంఖ్య తగ్గుముఖం

● కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



కలెక్టరేట్‌లో మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్ గోపాల్‌రెడ్డి

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రస్తుతం వాంతులు, విరోచనాలు తదితర అస్వస్థత లక్షణాలతో ఉన్నవారి సంఖ్య తగ్గుముఖం పట్టిందని కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో తగ్గేవరకు ప్రత్యేక సర్వే బృందాలు ఇంటింటికి వెళ్లి ముందస్తు జాగ్రత్త చర్యలు తెలియజెప్పడంతో పాటు, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్న ఆత్మస్థైర్యాన్ని కల్పించాలన్నారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో కలెక్టర్ నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, ప్రత్యేక అధికారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్‌తో కలసి వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్, ఇంటింటి సర్వే కోసం ఏర్పాటు చేసిన బృందాలతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాంతులు, విరోచనాల లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వే బృం దాలు వైద్య ఆరోగ్యశాఖ అందించే కరపత్రాలు, అవసరమైన మందులను పంపిణీ చేయడంతో పాటు అస్వస్థత లక్షణాలతో ఉన్న వారికి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అస్వస్థతకు గల కారణాలు ఇప్పటి కీ తెలియరాలేదని, త్రాగునీటి శాంపిల్స్ ఫలితాలు రావాల్సి ఉన్నందున ప్రస్తుతం నగరపాలక సంస్థ ట్యాంకర్ల సరఫరా చేస్తున్న తాగునీటిని మాత్రమే కాచి చల్లార్చి తాగాలని తెలియజేయాలన్నారు. కొద్దిపాటి అస్వస్థ లక్షణా లున్న ప్రత్యేక మెడికల్ క్యాంపులకు వచ్చి వైద్యసేవలు పొందాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. లక్షణాలను బట్టి స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రం , జిల్లా ఆస్పత్రులలో పూర్తిస్థాయి వైద్యసేవలు అందిస్తారాన్ని వివ రించాలని సూచించారు. సర్వే బృందాల పర్యవేక్షణ అధికారులు క్షేత్రస్థాయి లో గుర్తించిన పారిశుధ్యం, మంచినీటి పైప్ లైన్లకు సంబంధించిన సమస్య లను ఎప్పటికప్పుడు నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు.

ఈ సమావేశంలో డీఎం హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, జాయింట్ డైరెక్టర్లు టి.రమేష్, డాక్టర్ నిర్మలా గ్లోరి, రీజనల్ డైరెక్టర్ శోభారాణి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఎస్ఈ సుందరరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్లలోని పైపు లైన్లను తొలగించాలి

● మళ్లీ పైపులైన్ కనెక్షన్లు ఇవ్వాలి
● సిబ్బందిని ఆదేశించిన కమిషనర్ కీర్తి


సిబ్బందికి సూచన ఇస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 13 : ఏఈల వారీగా ప్రతి ఇంటికి ఉన్న తాగునీటి కనెక్షన్లను పరిశీలించి, ఎక్కడైనా డ్రెయిన్‌ని క్రాస్ చేస్తూ ఉంటే వెం టనే తొలగించి, డ్రెయిన్‌కి దూరంగా రీ కనెక్షన్ ఇవ్వాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం శారదాకాలనీ రిజర్వాయర్లో ఇంటింటి వాటర్ సర్వేకి సంబంధించి ప్రత్యేక విధులు కేటాయించబడిన ఏఈలు, డీఈఈలతో ఈఎన్‌సీ ఆనందరావుతో కలిసి కమిషనర్ క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శారదాకాలనీలో వీధుల వారీగా విధులు కేటాయించబడిన ఏఈలు ప్రతి ఇంటికి ఇచ్చిన తాగునీటి కనెక్షన్ను పరిశీలించాలని, ఎక్కడైనా డ్రెయిన్‌ని క్రాస్ చేస్తూ ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే కనెక్షన్ తొలగించాలన్నారు. అనారోగ్యానికి గురైన వారి ఇంటిలో తప్పనిసరిగా క్లోరిన్ శ్యాంపిల్స్ తీసి, వారు వినియోగిస్తున్న నీరు, వాటర్ ట్యాంక్‌లపై సమగ్ర వివరాలుసేకరిం చాలని ఆదేశించారు. శారదా కాలనీలోని కొన్ని వీధుల్లో రెండు పైప్ లైన్లు ఉన్నాయని, వాటిలో ఒక లైన్‌ని తొలగించాలన్నారు. అనంతరం శారదాకాలని, లాంచెస్టర్ రోడ్, ఐపీడీ కాలనీల్లో ప్రజల అనారోగ్య సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేకం గా మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశామన్నారు. శారదాకాలని, లాంచె స్టర్ రోడ్, ఐపీడీ కాలనీల్లో 7ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంప్‌లకు పోలేశ్వరరావు, బాలాజీ బాషా, రెహ్మాన్‌లను సూపర్వైజరి అధికారులకు బాధ్యతలు కేటాయించామని తెలిపారు. అలాగే శారదాకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం చికిత్స తీసుకుంటున్న వారితో మాట్లాడగా వారు కొనేళ్ళుగా మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి తెచ్చుకున్న నీటిని తాగుతు న్నామని, ప్రస్తుతం తమకు విరేచనాలు, వాంతులు అవుతున్నాయని తెలిపారు. వెంటనే స్పందించిన కమిషనర్ శారదాకాలని, ఐపీడీ కాలని, సంగడిగుంట ప్రాంతాల్లో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేసి, నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రమాణాలు పాటించని వాటి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఎంహెచ్‌వోని ఆదేశించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజిలోని రీజినల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరి సివిల్ సర్జన్ బాక్టీరి యాలజిస్ట్ నగరంలోని పానీపూరి బండ్లు కూడా అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కి లిఖిత పూర్వకంగా సూచించారు. పర్యటనలో ఎస్ఈ (ఎఫ్ఏసీ) సుందర్రామి రెడ్డి, ఈఈ. కోటేశ్వరరావు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు రూ.21 వేల కోట్లు తక్షణం చెల్లించాలి

● ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు


ఏపీ జేఏసీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 13 : ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 21 వేల కోట్లు తక్షణం చెల్లించాలని ఏపీ జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీ జేఏసీ జిల్లా కార్యవర్గ సమావేశం ఏపీ జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక ఎన్జీవో హోం నందు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల గురించి, ఏపీ జేఏసీ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణ గురించి చర్చించారు. ముఖ్యంగా ఉద్యోగులకు రావలసిన బకాయిలు జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, డీఏ ఎరియర్స్, పీఆర్‌సీ ఎరియర్స్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సీపీఎస్, జీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయుట, 12వ పీఆర్‌సీకి సంబంధించి తాత్కాలిక భృతి మంజూరు చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల ఉద్యమ కార్యాచరణ యథావిధిగా ఉంటుందని తెలియజేశారు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు చెల్లించవలసిన 21 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలియజేశారు. ఏపీ జేఏసీ జిల్లా కన్వీనర్ శెట్టిపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను తక్షణం క్రమబద్ధీకరించాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు యాప్‌లను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ శాఖల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు హాజరై ఉద్యోగుల కనీస అవసరాలు తీర్చే వరకు ప్రభుత్వంపై తమ పోరాటం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘ నేతలు పెదబాబు, ఏపీటీఎఫ్ 1938 వేలాంగిని రాజు, యూటీఎఫ్ కళాధర్, ఏపీటీఎఫ్ 257 బసవలింగారావు, యూటీఎఫ్ ఆదిలక్ష్మి, వివిధ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

వ్యాపార సంస్థలకు లైసెన్స్ తప్పనిసరి

● సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్ కుమార్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13: వ్యాపార సంస్థలకు, దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీని వాస్‌కుమార్ అన్నారు. అరండల్‌పేట కార్మికశాఖ కార్యాలయంలో వర్తక యాజమాన్య సంఘాలతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. అనంతరం ఎస్ శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కావున వ్యాపారులు విధిగా లైసెన్స్ తీసుకోవాలని, నమోదు ప్రక్రియ ఈ నెల 29వ తేదీతో ముగుస్తుందని వివరించారు. సమావేశంలో సహాయ కార్మిక కమిష నర్ ఎం సుభాని, గుంటూరు కిరణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవతి పుల్లారావు, కార్యదర్శి రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మారెడ్డి వెంకటరమణను కలిసిన అప్పిరెడ్డి

గుంటూరు, ఫిబ్రవరి 13: వైసీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థిగా నియమితులైన ఉమ్మారెడ్డి వెంకటరమణను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కృష్ణనగర్‌లోని కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలతో పాటు వివిధ రాజకీయ అంశాలపై చర్చించారు. వారి వెంట ఎమ్మెల్యే కిలారి రోశయ్య, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ షేక్ సుభాని, నూనె ఉమామహేశ్వరరెడ్డి తదితరులున్నారు.

బీఈడీ అభ్యర్థులకు తక్కువ పోస్టులతో అసంతృప్తి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13: ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వ హించే డీఎస్సీ నోటిఫికేషన్ కోసం బీఈడీ పూర్తి చేసి ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూసిన నిరుద్యోగులకు తక్కువ పోస్టులు ఉండటంతో తీవ్ర అసంతృ ప్తితో ఉన్నారని ఎన్జీయూ అధ్యక్ష, కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఖాళీలు ఎక్కువగా ఉన్నట్లు చూపి ప్రస్తుతం పొంతన లేకుండా నోటిఫికేషన్ విడుదల చేయడం సమంజసం కాదని తెలిపారు. అదేవిధంగా 12 సంవత్సరాల క్రితం అమల్లో ఉన్న అప్రెం టిస్ విధానం ఎన్నో పోరాటాల ఫలితంగా రద్దు చేశారని, దీనిని పునరుద్ధరించడం శోచనీయమని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎస్సీలకు సరైన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13: రాబోయే ఎన్నికల్లో ఎస్సీలకు కేటాయిం చిన అసెంబ్లీ స్థానాల్లో ఎటువంటి అవకతవకలు జరిగితే అయా ప్రధాన రాజకీయ పార్టీలు బాధ్యత వహించాలని స్వర్ణాంధ్రా ఏమ్మార్పీఎస్ వ్యవస్థా పక అధ్యక్షుడు ఏసుబాబుమాదిగ స్పష్టం చేశారు. మంగళవారం గోరంట్ల సంఘ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీట్ల కేటాయింపుల్లో నిజమైన ఎస్సీలకు అన్యాయం జరిగిం దని వివరించారు. ప్రస్తుతం ఇటువంటివి జరిగితే మౌనంగా ఉండమని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

జనసేనానితో డాక్టర్ పెమ్మసాని భేటీ


పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ నేత డాక్టర్ పెమ్మసాని


గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో తెలుగుదేశం పార్టీ నేత, ఎన్ఆర్ఐ డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ మంగళవారం మంగళగిరి జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దిగేందుకు సిద్ధమైన పెమ్మసాని రెండురోజుల క్రితం తెనాలి మండలంలోని తన స్వగ్రామమైన బుర్రిపాలెనికి చేరుకున్న విషయం తెలిసిందే.

పెమ్మసానిని కలిసిన నగర టీడీపీ నాయకులు

టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్‌ను బుర్రిపాలెంలో నగరంలోని 23వ డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ గంటా పెద్దబ్బాయ్, టీడీపీ మహిళా నాయకురాలు గంటా వెంకట మౌళిక, గాదిరెడ్డి మురళీ, టైలర్ బుజ్జి, నాగూర్ పలువురు నాయకులు సోమవారం ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● బాధ్యతలు స్వీకరించిన అదనపు ఎస్పీకి ఎస్పీ సూచన


ఎస్పీ తుషార్ డూడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎస్పీ రమణమూర్తి

గుంటూరు, ఫిబ్రవరి 13: పోలీస్ సిబ్బంది సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ జీవీ రమణమూర్తికి జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడిని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జీవీ రమణమూర్తి మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛంతో పోలీసు కార్యాలయంలో కలిశారు. ఇటీవల కాలంలో సాధారణ అడిషనల్ ఎస్పీల బదిలీల ప్రక్రియలో బాగంగా విజయవాడ సిటీ నుంచి గుంటూరు అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా రమణమూర్తి బదిలీపై వచ్చారు. జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జీవీ రమణమూర్తి 1989లో ఎస్ఐగా పోలీసుశాఖలో చేరి అంచెలంచెలుగా పదోన్నతులు పొంది, ఏలూరు, అవనిగడ్డ, బందరు, తిరువూరు, విజయవాడ, గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా తెనాలి మొదలైన ప్రాంతాల్లో పని చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి సంబంధించి పెండింగ్ ఫైళ్ళను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు, ఫిబ్రవరి 13 : స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పట్నంబజార్ సమీపంలోని పల్నాడు బస్టాండ్ నిషా బార్ వద్ద సుమారు 65 నుంచి 70 సంవత్సరాలు కలిగిన ఒక గుర్తు తెలియని వ్యక్తి అనుమానా స్పద స్థితిలో మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీ నందు భద్ర పరిచారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు లాలాపేట సీఐకి 8688831311లో గానీ, స్టేషన్ రైటర్‌కు 9440835105లో గానీ తెలియజేయాలని పోలీసులు కోరారు.

రంగంలోకి దిగిన ఎంపీ లావు

● డాక్టర్లు.. ఉపాధ్యాయులతో భేటీ

నరసరావుపేట, ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి 13: నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా బరిలో దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అన్ని వర్గాల నుంచి మద్దతు కూడగట్టుకోనే పనిలో అయన నిమగ్నమయ్యారు. మరో వైపు రానున్న వారంలో లావు టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తనతో పాటు వైసీపీలో ముఖ్యనేతలు కూడా టీడీపీలో చేరేందుకు సమయాత్తమవుతున్నారు. పార్టీ చేరే ముహూర్తం ఖరా రు చేసుకుంటునే నియోజకవర్గంలోని తెలుగుదేశం నేతలతో తన పోటీ అంశంలో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే పలువురు టీడీపీ నేతలు అయనను కలసి మద్దతు తెలిపారు. టీడీపీ తనను అభ్యర్థిగా ఖరారు చేసిన అనంతరం నరసరావుపేటలోని తన కార్యాలయానికి లావు మంగళవారం వచ్చారు. ఈ నేపథ్యంలో అయనను పలువురు నేతలు కలిశారు. మరో వైపు ఉపాధ్యాయులు రాయలును కలసి వారి మద్దతును తెలియజేశారు. మరో వైపు ప్రముఖ వైద్యుడు డాక్టర్ మర్రి పెద్దయ్య ఇంటిలో ఏర్పాటు చేసిన విందుకు లావును అహ్వానించారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై వైద్యులతో లావు చర్చించారు. టిక్కెట్ రేసులో ఉన్న నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు విందులో పాల్గొన్నారు.

మా మద్దతు మీకే.. ఈ ప్రభుత్వం వేధింపులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మీ విజయానికి కృషి చేస్తాం అని ఉపాధ్యాయులు ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలుకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

విధుల్లో చేరీచేరక ముందే డీఎస్పీల బదిలీలు

గుంటూరు, ఫిబ్రవరి 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీల బదిలీలు నిర్వహించగా వారు కొత్త ప్రదేశంలో విధుల్లో చేరీ చేరక ముందే మళ్ళీ బదిలీ చేశారు. వైసీపీ నేతల సిఫార్సులకనుగుణంగా ఆయా డీఎస్పీల బదిలీల్లో మార్పులు, చేర్పులు చేశారు. తాజాగా బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా శ్రీసిటీ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్‌ను బాపట్ల క్రైమ్స్ డీఎస్పీగా నియమించారు. ఇటీవల బాపట్ల క్రైమ్స్ డీఎస్పీగా నియమితులైన సీహెచ్ శ్రీనివాసరావును ఏసీబీకి బదిలీ చేసి అటాచ్‌మెంట్‌పై ఎస్సీ ఎస్టీ సెల్‌కు నియమించారు. ఇప్పటి వరకు నార్త్ డీఎస్పీగా పని చేసి ఇటీవల మచిలీపట్నంకు నియమితులైన జవంగుల రాంబాబును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు. మైలవరం డీఎస్పీగా పని చేసి ఇటీవల గుంటూరు సీసీఎస్‌కు నియమితులైన ఎం రమేష్‌ను తెనాలి డీఎస్పీగా నియమించారు. ఏసీబీలో పని చేస్తూ ఇటీవల పల్నాడు ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీగా నియమితులైన ఎస్ షప్రుద్దీన్‌ను ఆళ్ళగడ్డ డీఎస్పీగా నియమించారు.

డయేరియా బాధితులకు అండగా ఉంటాం

● జీజీహెచ్‌లో బాధితులకు పండ్లు పంపిణీ చేసిన టీడీపీ నేత ఆరిఫ్

గుంటూరు, ఫిబ్రవరి 13: గుంటూరు నగరంలో డయేరియా వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్న బాధితులకు అండగా ఉంటామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు షేక్ ఆరిఫ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న బాధితులకు పండ్లు పంపిణీ చేసి చికిత్స అందుతున్న విధానాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రాణనష్టం కలగకుండా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలని కోరారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

దాడి చేయించిన ఎమ్మెల్యే, పీఏపై చర్యలు తీసుకోవాలి

● ఎంపీ విజయసాయిరెడ్డికి వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 13: తనకు చేసిన మోసాన్ని ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే మద్దాళిగిరి, ఆయన పీఏ మధుల ప్రోద్బలంతో నాపై దాడి చేయించారని వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీ విజయసాయిరెడ్డికి వక్ఫ్‌బోర్డు జిల్లా జాయింట్ సెక్రటరీ షేక్‌సుభాని ఫిర్యాదు చేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశానికి హాజరైన ఎంపీని సుభాని కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదు మేరకు నేటికీ కేసు నమోదు చేయలేదని, వారిపై చర్యలు తీసుకోవటంతో పాటు తనకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై న్యాయం చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారని సుభాని తెలిపాడు.

ఇంట్లో తాగేనీటిలో క్లోరిన్ శాంపిల్ సేకరించాలి

● సీడీఎంఏ శ్రీకేష్ బీ లత్కర్

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 12 : శారదా కాలనిలోని ప్రతి ఇంట్లో తాగునీటి సరఫరా జరిగే సమయంలో క్లోరిన్ శ్యాంపిల్స్‌సేకరించాలని, ఇళ్లల్లో నిల్వ చేసిన నీటిని కూడా తొలగించేలా ఎమినిటి కార్యదర్శులు, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీడీఎంఏ శ్రీకేష్ బి.లత్కర్ తెలిపారు. మంగళవారం నగర కమిషనర్ కీర్తి చేకూరి, స్పెషల్ ఆఫీసర్ తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ ఆనందరావు, ఇతర అధికారులతో కలిసి సీడీఎంఏ శారదాకాలని రిజర్వాయర్, పట్టణ ఆరోగ్య కేంద్రం, పలు వీధుల్లోని పైప్ లైన్ కనెక్షన్స్‌ని పరిశీలించి, తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ ఎన్ శ్రీనివాసులు, జీఎంసీ ఎస్ఈ సుంద ర్రామిరెడ్డి, సీఎంవోహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్‌వో మధుసూదన్, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల డిజిటలైజేషన్‌తో ఉపయోగాలు

● సంచాలకులు ఎంఆర్ ప్రసన్నకుమార్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13: పౌర గ్రంథాలయాల డిజిటలైజేషన్ వల్ల పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగమని సంచాలకులు డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ అన్నారు. మంగళవారం అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థను డైరెక్టర్ లైబ్రరీస్ విజయలక్ష్మీ, డైరెక్టరు లైబ్రరీస్, బ్రిటీష్ కౌన్సిల్ సభ్యులు మేఘా కక్కర్ తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఆర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గ్రంథాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యులు జి.మహేష్, ఉపసంచాలకులు షేక్ పీర్ అహ్మద్, సహాయ సంచాలకులు రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంజన్‌బాబు విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

● జేసీ రాజకుమారికి దళిత, ప్రజాసంఘాల నాయకుల వినతి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 'బాలబాట' కార్యక్రమాన్ని రూపొందించి పేద విద్యార్థులకు విద్యను అందించడానికి కృషి చేసిన డాక్టర్ పుల్లగూర రంజన్‌బాబు విగ్రహ ఏర్పాటుకై నగరంలో స్థలం కేటాయించాలని ఇద్వా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరం బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ కార్యాలయంలో జేసీ రాజకుమారికి దళిత, ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. విగ్రహ ఏర్పాటుకు దళిత, ప్రజాసంఘాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో చెన్నం డేవిడ్ విలియమ్స్, మరియదాసు, బేతపూడి భారతి తదితరులు ఉన్నారు.

లెటర్ సిరీస్

దిక్సూచి
DIKSUCHI

పోటీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్



పార్ట్-3

1. L - NMMN - NNL - L - MN -
(ఎ) MLLMM (బి) MLMLM
(సి) LLMMM (డి) ఏదీకాదు

సమాధానం: (బి)
వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
LMNM / MNLN / NLML / LMNM
ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలు LMN / MNL /NLM / LMN కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదే విధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది. అంతేకాక ప్రతి సమూహంలో రెండో అక్షరమే తిరిగి నాలుగో అక్షరంగా రిపీట్ అయింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLMLM

2. a - bcb - cac - a - aa - c
(ఎ) abcbb (బి) abbcb
(సి) abbbc (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)
వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
aabc / bbca / ccab /aabc
ప్రతి సమూహంలోను చివరి మూడు అక్షరాలు అయిన abc / bca / cab / abc కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది. అంతేకాక మొదటి సమూహంలో మొదటి అక్షరంగా a, రెండో సమూహంలో మొదటి అక్షరంగా b, మూడో సమూహంలో మొదటి అక్షరంగా 'c' ఉంది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు abcbb

3. a - ab - ab - b - b - b -
(ఎ) bbabbb (బి) bbbbba
(సి) bbbabb (డి) ఏదీకాదు

సమాధానం: (సి)
వివరణ: ఆప్షన్ (సి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
ab / abb / abbb / abbbb
రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దానిముందు సమూహంలోని అక్షరాలే ఉంటూ ఒక 'b' అదనంగా చేరింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bbbabb

4. L - N - LM - ML - N - LM - L
(ఎ) MMNNNN (బి) MLNMNN
(సి) MNMNMN (డి) ఏదీకాదు

సమాధానం: (బి)
వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
LMNL / LMNM / LMNN / LMNL
ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా LMN ఉంటూ, నాలుగో అక్షరంగా మొదటి సమూహంలో L, రెండో సమూహంలో M, మూడో సమూహంలో N ఉన్నాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLNMNN

5. P - QQ - RRR - P - Q
(ఎ) PPPQ (బి) PQPP (సి) PPQP
(డి) ఏదీకాదు **సమాధానం:** (బి)
వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
PPQ / QQR/ RRP / PPQ
ప్రతి సమూహంలోను మొదటి రెండు అక్షరాలు సేమ్. ∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు PQPP

6. P - P - PP - PP - P - P - PP
(ఎ) QPQPQP (బి) PQPQPQ
(సి) PPPQQQ (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)
వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
PQPP / PPQP/ PPPQ / PPPP
మొదటి సమూహంలో ఒక P తరవాత Q, రెండో సమూహంలో రెండు Pలు తదుపరి Q, మూడో సమూహంలో మూడు Pలు తదుపరి Q ఉంటూ నాలుగో సమూహంలో నాలుగు Pలతో ఈ సిరీస్ పూర్తి అయింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు QPQPQP

7. a - cca - b - aab -
(ఎ) bcbc (బి) bbcc (సి) cbcb
(డి) ఏదీకాదు **సమాధానం:** (బి)
వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
abc / cab / bca / abc
మొదటి సమూహంలో చివరి అక్షరం రెండో సమూహంలో మొదటి అక్షరంగా మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదే విధంగా రెండో సమూహంలోని చివరి అక్షరం మూడో సమూహంలో మొదటి అక్షరంగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈవిధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bbcc

8. a - bc - ab - cdabc - dab - d -
(ఎ) adbccd (బి) abcddc
(సి) abcdcd (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)
వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
aabcd / abbcd abccd /abcdd
ప్రతి సమూహంలోను abcd అనే నాలుగు అక్షరాలు ఉంటూ మొదటి సమూహంలో a స్థానంలో రెండు aలు రెండో సమూహంలో b స్థానంలో రెండు bలు మూడో సమూహంలో c స్థానంలో మూడు cలు, నాలుగో సమూహంలో d స్థానంలో రెండు dలు ఉన్నాయి. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు adbccd



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో కీలక మార్పులు



ప్రతిభ ప్రదర్శించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, ఉత్తమ విలువలు కలిగిన చిత్రాలను ఎంపిక చేసి ప్రతి ఏటా ఇచ్చే జాతీయ చలనచిత్ర అవార్డుల్లో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇప్పటి వరకూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరు మీద ఇచ్చే 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' అవార్డ్‌ను ఇకపై ఆ పేరుతో కాకుండా 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' పేరుతో ఇస్తారు. అంటే అందులో ఉన్న 'ఇందిరాగాంధీ' పేరు తొలిగించారన్న మాట. ఈ విభాగంలో దర్శకుడితో పాటు నిర్మాతకు కూడా ప్రైజ్ మనీ ఇచ్చేవారు. ఇకపై దర్శకుడికి మాత్రమే ప్రైజ్ మనీ ఇస్తారు. అలాగే బాలీవుడ్ నటి నర్గిస్ పేరు మీద జాతీయ సమైకత్యను పెంపొందించే చిత్రానికి ఓ అవార్డ్ ఇస్తున్నారు. ఇకపై ఆ అవార్డులో నర్గిస్ పేరు కూడా ఉండదు. 'జాతీయ, సామాజిక, పర్యావణ విలువలు పెంపొందించే ఉత్తమ చిత్రం' పేరుతో ఆ అవార్డ్ అందజేస్తారు. కేంద్ర సమాచార శాఖ అదనపు కార్యదర్శి నీర్జా శేఖర్ నేతృత్వంలోని కమిటీ సమావేశమై జాతీయ చలనచిత్ర అవార్డులలో కీలక మార్పులు చేస్తూ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో పాటు సెన్సార్ బోర్డ్ చైర్మన్ ప్రసూన్ జోషి, సినీ ప్రముఖులు ప్రియదర్శన్, విపుల్ షా, ఛాయాగ్రాహకుడు నల్లముత్తు కూడా ఉన్నారు. జాతీయ చలనచిత్ర అవార్డులు 2022 కోసం ఎంట్రీలు స్వీకరించడానికి జనవరి 30తో గడువు ముగియడంతో ఈ కమిటీ సమావేశమై పలు కొత్త నిర్ణయాలు తీసుకుంది. ఈ విషయాన్ని కమిటీ సభ్యుడైన దర్శకుడు ప్రియదర్శన్ ధ్రువీకరించారు. 'నేను కూడా కొన్ని సూచనలు చేశాను. సౌండ్ విభాగానికి కూడా అవార్డులు ఇవ్వాలన్నది వాటిలో ఒకటి' అని ఆయన వెల్లడించారు.

మార్పులు ఇవే

- చలనచిత్ర పరిశ్రమకు ఇతోధిక సేవలు అందించిన చలనచిత్ర ప్రముఖులకు ఇచ్చే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్‌కు ఇంతవరకూ రూ పది లక్షలు నగదు ఇస్తున్నారు. ఆ మొత్తాన్ని ఇప్పుడు రూ 15 లక్షలకు పెంచారు.
- స్వర్ణకమలం అవార్డ్ పొందిన వారికి ఇకపై రూ. మూడు లక్షలు, రజిత కమలం పొందిన వారికి రూ రెండు లక్షలు అందజేస్తారు. ఉత్తమ చిత్రం, ఉత్తమ తొలి చిత్రం, పూర్తి వినోదాత్మక చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ బాలల చిత్రం .. విభాగాలకు స్వర్ణ కమలం అందిస్తారు. ఇక మిగిలిన అన్ని విభాగాలు.. అంటే ఉత్తమ ప్రబోధాత్మక చిత్రం, నటనా విభాగంలో వచ్చే అవార్డులు, ఉత్తమ స్ర్కీన్‌ప్లే, ఉత్తమ సంగీత దర్శకుడు.. ఇలాంటి అన్ని అవార్డులకు రజిత కమలం అందిస్తారు.
- ఇప్పటివరకూ బెస్ట్ ఏనిమేషన్ ఫిల్మ్, 'బెస్ట్ స్పెషల్ ఎఫెక్ట్ ఫిల్మ్' అంటూ విడివిడిగా అవార్డులు ఇస్తున్నారు. ఇకపై ఈ రెంటినీ కలిపేసి 'బెస్ట్ ఎవిజీసీ'(యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) పేరుతో అవార్డులు ఇస్తారు.
- బెస్ట్ ఆడియోగ్రఫీ విభాగంలో మూడు సబ్ కేటగిరిలు ఉన్నాయి. 'సౌండ్ రికార్డిస్ట్', 'సౌండ్ డిజైనర్', 'ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్ రికార్డిస్ట్' అని. ఇకపై ఇవన్నీ కలిపి 'బెస్ట్ సౌండ్ డిజైనర్' పేరుతో అవార్డ్ ఇస్తారు. ప్రైజ్ మనీని కూడా యాభై వేల నుంచి రెండు లక్షల రూపాయలకు పెంచారు.
- ఉత్తమ సంగీత దర్శకుడు పేరుతో ఇచ్చే అవార్డ్‌ను ఇకపై 'ఉత్తమ నేపథ్య సంగీతం' పేరుతో ఇవ్వనున్నారు.
- ప్రత్యేక జ్యూరీ అవార్డ్‌ను తొలగించి ఆ స్థానంలో ఫీచర్ ఫిల్మ్‌కు ఒక అవార్డ్, నాన్ ఫీచర్ ఫిల్మ్‌కు ఒక అవార్డ్ ను ఇచ్చే అధికారాన్ని జ్యూరీకి ఇచ్చారు
- నాన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇచ్చే కొన్ని అవార్డులు తొలిగించారు. మరికొన్ని కలిపేశారు. 'బెస్ట్ స్ర్కిప్ట్' పేరుతో కొత్తగా ఒక అవార్డును ఏర్పాటు చేశారు.


హ్యాట్రిక్ సాధిస్తామనే నమ్మకం ఉంది



రాజేశ్ దండా

సందీప్ కిషన్, నేను, దర్శకుడు ఆనంద్ స్నేహితులం. హాస్య మూవీస్ సంస్థను ప్రారంభించి తీయాలనుకున్న మొదటి సినిమా 'ఊరు పేరు భైరవకోన'. సందీప్ కిషన్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్ చిత్రం ఇది. బిజినెస్ కూడా అదే స్థాయిలో జరిగింది. అందుకే విడుదలకు ముందే హ్యాపీగా ఉన్నాం' అన్నారు నిర్మాత రాజేశ్ దండా. సందీప్ కిషన్ హీరోగా ఆయన నిర్మించిన 'ఊరు పేరు భైరవకోన' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో చిత్ర విశేషాలు పంచుకొన్నారు. నచ్చిన కథలు చేసుకుంటూ వెళుతున్నామని చెబుతూ 'మా సంస్థ సక్సెస్ ట్రాక్‌ను 'ఊరు పేరు భైరవకోన' కొనసాగించి హ్యాట్రిక్ అందిస్తుందనే నమ్మకం ఉంది. ప్రీమియర్ షోలన్నీ ఫుల్ కావడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు అద్దం పడుతుంది' అని ఆయన చెప్పారు. చిత్రంలోని అంశాల గురించి వివరిస్తూ 'ఇదొక ఫాంటసీ థ్రిల్లర్. 'భైరవకోన' అనే ఊరులో ఎవరూ ఊహించని సంఘటనలు జరుగుతుంటాయి. అలాగే గరుడ పురాణం పుస్తకంలో మిస్ అయిన పేజీలకు, ఈ కథకు ఉన్న లింక్ కూడా ఆసక్తికరంగా ఉంటుంది. చిత్రంలో 47 నిముషాల అద్భుతమైన సీజీ వర్క్ ఉంది. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చే సినిమా ఇది' అని రాజేశ్ చెప్పారు.

పాచికల ఆట నేపథ్యం



రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో వైనాట్ స్టూడియో నిర్మించిన చిత్రం 'భ్రమయుగం'. మమ్ముట్టి కథానాయకుడు. పాచికల ఆట నేపథ్యంలో అనుక్షణం ఉత్కంఠ కలిగించే విధంగా చిత్రం ఉంటుందని దర్శకనిర్మాతలు చెబుతున్నారు. ఓ గాయకుడి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. మొదట మలయాళంలో మాత్రమే విడుదల చేసి, ఆ తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేయాలని నిర్మాణ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. 'భ్రమయుగం' చిత్రానికి సినిమాటోగ్రఫీ: షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జేవియర్, మాటలు: టి.డి. రామకృష్ణన్, నిర్మాతలు: చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్.

స్నేహ గీతం



ఇంద్ర, కోమల్ నాయర్, దీప, స్వాతి శర్మ ప్రధాన తారాగణంగా స్నేహం గొప్పతనాన్ని తెలిపే కథాంశంతో రూపొందిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. లక్ష్మణ్ జెల్ల దర్శకత్వంలో చంద్ర ఎస్ చంద్ర, డాక్టర్ విజయ రమేశ్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'నా కల' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'చిత్రీకరణ దాదాపు పూర్తయింది. కొత్త, పాత నటుల కాంబినేషన్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అన్నారు. గాయని సునీత ఆలపించిన ఈ గీతం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు అన్నారు. ఇందులో తన పాత్ర సరికొత్తగా ఉండబోతోందని ఇంద్ర చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రావణ్ భరద్వాజ. సినిమాటోగ్రఫీ: రాహుల్ మాచినేని

సామాజిక బాధ్యతతో సినిమా తీశాం



వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. అఖిలన్, వీణ, వినోద్‌కుమార్, వాణీ విశ్వనాథ్ కీలక పాత్రలు పోషించారు. భాను దర్శకత్వంలో కంఠంనేని రవిశంకర్ నిర్మించారు. ఈ నెల 15న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో నిర్మాత మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా ఇన్ని వేల ఎకరాల భూములు ఇస్తే దానిని ఎగతాళి చేస్తూ, వారిని మానసిక క్షోభకు గురి చేసిన సంఘటనలు ఈ మధ్య కాలంలో చోటు చేసుకున్నాయి. దానిని స్ఫూర్తిగా తీసుకుని రైతుల పక్షాన ఒక సినిమా తీయాలని అనుకున్నాం. అయితే ఈ సినిమా ఏ పార్టీకి వ్యతిరేకం కాదు. రైతుల కన్నీళ్లు తుడిచే విధంగా సమాజాన్ని చైతన్యపరుస్తూ ఓ సామాజిక బాధ్యతతో ఈ సినిమా నిర్మించాం.. దర్శకుడు భాను అద్భుతంగా తీశారు. సినిమాకు అఖండ విజయం అందించి రైతులకు సంఘీభావం తెలియజేయాలి' అని కోరారు. ఇందులో తను రైతు పాత్ర పోషించాననీ, ఇది పొలిటికల్ ఫిల్మ్ కాదనీ, రైతుల ఆవేదనని తెలియజేసే కథ అని వినోద్‌కుమార్ చెప్పారు. ఈ సినిమాలో తను భాగం అయినందుకు ఆనందంగా ఉందని వాణీ విశ్వనాథ్ చెప్పారు. ఏడు వందల మంది రైతులతో ఈ సినిమా తీశామని దర్శకుడు భాను చెప్పారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, మహిళలు ఇందులో నటించారని తెలిపారు. అందరికీ ఉపయోగపడే సినిమా ఇదన్నారు.

శివనాగిని సిద్ధం



సురేశ్, మమతా రాహుత్ హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'శివనాగిని'. సుమన్, షాయాజీషిండే, అజయ్ ఘోష్ కీలకపాత్రలు పోషించారు. మొండెం శ్రీధర్ దర్శకత్వంలో చదలవాడ హరిబాబు నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "శివనాగిని'లో 30 నిమిషాల గ్రాఫిక్ సీక్వెన్స్ ఉంది. మారెడుమల్లి అడవుల్లో అద్భుతమైన లోకేషన్లలో చిత్రీకరణ చేశాం. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జాన్ పోట్ల. సినిమాటోగ్రఫీ: యామేష్

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/9ZVu7hY లో చదవండి.

SCHOLARSHIP ALERT

Bhalodia-Khetan Summer Research Excellence Award

Description: Bhalodia-Khetan Summer Research Excellence Award 2024 is an opportunity offered by the Indian Institute of Technology, Gandhinagar to honor and recognise outstanding research conducted by students participating in the Summer Research Internship Program (SRIP) at IIT Gandhinagar.
Eligibility: Open for students who have completed the Summer Research Internship Programme (SRIP) under the faculty guides' evaluation at the Indian Institute of Technology (IIT), Gandhinagar.
Prizes & Rewards: An award of 50,000 (one-time)
Last Date to Apply: 05-03-2024
Application mode: Online Applications Only
Short Url: www.b4s.in/aj/BKSA1

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/pNikVWtలో చదవండి.

National AIDS Control Organisation Internship Programme



Description: National AIDS Control Organisation (NACO) Internship Programme 2024 is an opportunity offered by the Ministry of Health & Family Welfare, Government of India for students pursuing undergraduate, postgraduate, M.Phil and Ph.D. degree courses in various disciplines.
Eligibility: Open for Indian nationals pursuing undergraduate, postgraduate, M.Phil, and Ph.D. degree courses in specified disciplines.
Prizes & Rewards: A monthly stipend of 8,000 and a completion certificate
Last Date to Apply: Round The Year
Application mode: via post or email at: Deputy Secretary National AIDS Control Organisation (NACO) 9th Floor, Chandralok Building, 36, Janpath, New Delhi – 110001 Email ID: naco.internship@gmail.com
Short Url: www.b4s.in/aj/NACO1

Summer Research Internship Program (SRIP)

Description: Summer Research Internship Program (SRIP) 2024 is a research opportunity offered by the Indian Institute of Technology, Gandhinagar, to students pursuing bachelor's or master's degrees at institutions in India.
Eligibility: Open for Indian nationals pursuing a bachelor's or master's degree at an Indian institution.
Prizes & Rewards: A weekly stipend of 2,000 and other benefits.
Last Date to Apply: 05-03-2024
Application mode: Online Only
Short Url: www.b4s.in/aj/SRIP2

buddy4study.com

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు


బాధిత కుటుంబానికి వంటసామగ్రిని అందిస్తున్న వైసీపీ నాయకులు

అగ్నిబాధితులకు ఎమ్మెల్యే రూ.25వేలు ఆర్థికసాయం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని కొలకలూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వం కోల్పోయిన మక్బూల్, ఇబ్రహీంల కుటుంబాలకు ఎమ్మెల్యే శివ కుమార్ పంపిన రూ.25వేలు ఆర్థికసాయాన్ని పార్టీ శ్రేణులు అందజేశారు. అంతేకాక వంట సామగ్రిని కూడా అందజేశారు. అగ్నిప్రమాదం జరిగిన తీరును బాధిత కుటుంబసభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పలువురు వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.


ఆలపాటి పంపిన రూ.50వేలు నగదు అందిస్తున్న టీడీపీ శ్రేణులు

ఆలపాటి రూ.50వేలు సాయం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 13: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కొలకలూరు గ్రామానికి చెందిన మక్బూల్, ఇబ్రహీంలకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అండగా నిలిచారు. ఆలపాటి పంపిన రూ.50వేలు నగదును గ్రామ పార్టీ మైనార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అండగా నిలిచారని, ఆ కుటుంబానికి ఆలపాటి పంపిన రూ.50వేలు అందించడం జరిగిందన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తోట లక్ష్మయ్య, అజీజ్ పలువురు ముస్లిం నాయకులు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వధువుకు ఆలపాటి పెండ్లికానుకను అందిస్తున్న టీడీపీ నాయకులు

వధువు కుటుంబానికి పెండ్లి కానుక అందజేత

తెనాలి రూరల్, ఫిబ్రవరి 13: వధువు కుటుంబానికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పెళ్లికానుక అందజేసి అండగా నిలుస్తున్నారు. మంగళవారం మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన కట్టా కోటేశ్వరరావు, శ్రీదేవి దంపతుల కుమార్తె శ్రీలక్ష్మితిరుపతమ్మ వివాహాన్ని పురస్కరించుకుని మంగళసూత్రం, నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు గ్రామ పార్టీ నాయకుల ద్వారా అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో తోట లక్ష్మయ్య, ముసలయ్య, అజీజ్ పలువురు గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి

కొల్లిపర, ఫిబ్రవరి 13: ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల పంటలను కొల్లిపర మండల మోడల్ టీమ్ ప్రదర్శన నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల పంటలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రతి కుటుంబం కూడా కావలసిన ఆకుకూరలు, కూరగాయలను పెరటిలో పండించుకుని తింటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. ప్రతిఒక్క రైతు ప్రకృతి వ్యవసాయంచేసి భావితరాలకు మంచి ఆరోగ్యాన్ని అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి సుధారాణి, ఎంటీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

16న సూర్య నమస్కారం పోటీలు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 13: ఈ నెల 16న రథసప్తమిని పురస్కరించుకుని బాలబాలికలకు నాలుగు విభాగాలుగా సూర్య నమస్కార పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగా భారతి, క్రీడాభారతి కన్వీనర్ ప్రభల మల్లికార్జునశర్మ తెలిపారు. పట్టణంలోని బోసరోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 16న ఉదయం 7గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆయా స్కూల్స్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని లేదా ఫోన్ నెంబర్లు 9490875076, 9985423198 ద్వారా సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న పట్టణ చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ పిన్నారావు తదితరులు

పారిశుధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 13: మురుగు కాల్వలో వ్యర్థాలను వేయవద్దని ప్రజలను పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం పారిశుధ్య పనులను పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మున్సిపల్ అధికారులతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వార్డులో ప్రధానంగా డ్రెయినేజీ సమస్యను గుర్తించామని చెప్పారు. మురుగు కాల్వలను ఆక్రమించి వాటిపై ర్యాంపులు వేశారని, షాపులవారు ఆక్రమించుకొని ఉండటం వలన సిల్ట్‌ను తొలగించడానికి మున్సిపల్ సిబ్బందికి ఇబ్బందిగా ఉండటం వల్ల మురుగును తొలగించలేక పోతున్నారని అన్నారు. వాటిని తొలగించి మురుగునీరు పారేట్టు చేస్తామని తెలిపారు. కాల్వలపై ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్నం పిన్నారావు, తోట రఘురాం, తాడిబోయిన రమేష్, ఏతా చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఆర్‌ఐ కుర్రా శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ ఎలక్ట్రికల్, గ్రీనరీ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు


రైతులతో కలిసి జొన్నపైర్లను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 13: వ్యవసాయశాఖ, జిల్లా వనరుల కేంద్రం అధికారులు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల బృందం మంగళవారం మండలంలోని హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు గ్రామాల్లోని మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినుము, పెసర పంటలు 35-45 రోజుల దశలో ఉన్నాయని ఆకుముడత, బొబ్బర లాంటి వైరస్ తెగుళ్లు సోకడం గమనించడం జరిగిందన్నారు. ఈ తెగుళ్ల వ్యాప్తిచేసే రసం పీల్చే పురుగుల నివారణ కోసం అవసరాన్ని బట్టి ఎకరాకు వేపనూనె (3000పీపీఎమ్) 1లీ, వేప గింజల కషాయం లేదా ప్రొఫెనోఫోస్ 400 మిలీ లేదా ఫిప్రొనిల్ 300 మిలీ లేదా స్పైనోసాడ్ 60 మిలీ, లేదా ఎసిఫేట్ 200గ్రాములు వీటిలో ఎదైనా ఒకటి పిచికారి చేయవలసి ఉందన్నారు. అదేవిధంగా జొన్నపైర్లు 40-45 రోజుల దశకు చేరుకున్నాయని వీటిలో గులాబిరంగు, మచ్చల కాండలం తొలిచే పురుగులను గమనించామన్నారు. వీటి నివారణకు కొరాజాన్ 60మి.లీ. లేదా ఫ్లూ బెంజోమైడ్ (ఫేమ్) 40గ్రాములు, ఇమామెక్టిన్ బెంజోయేట్ (ప్రోక్లెయిమ్) 80గ్రాములు, స్పైనోసాడ్ 60మి.లీ, స్పైనెటోరామ్ 100మిలీ వీటిలో ఏదో ఒకటి ఎకరానికి పైరు మొత్తం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉనికిని గమనించడం జరిగిందన్నారు. అవసరాన్ని బట్టి వాటి నివారణకు ఇమిమోకాన్ బెంజోయేట్ 80గ్రాములు, స్పైనోసాడ్ 60మిలీ, స్పైనిటోరమ్ 100 మిలీ వీటిలో ఏదో ఒకరకాన్ని పిచికారి చేయాలని 10-15 రోజుల వ్యవధిలో వేరేరకం మందును అవసరాన్ని బట్టి పిచికారి చేయాలని కోరారు. ప్రాజెక్టు డైరెక్టర్ ఆత్మ గుంటూరు పి.రామాంజనేయులు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీలతావాణి, ఏడీఏ ఉషారాణి, ఏవో ప్రేమసాగర్, ఏఈవో విజయమోహన్, వీఏఏలు పలువురు రైతులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి

● పుకార్లను నమ్మకుండా బాధ్యతను గుర్తు చేసుకోండి
● ఇంటింటి ప్రచారం ముమ్మరం చేయండి
● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 13: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నో అవమానాలను చవిచూశాం.. వాటిని ఓర్పుగా భరించాం.. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేశాం.. ఈ మధ్యకాలంలో వస్తున్న పుకార్లను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దు. వైసీపీ మన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకే సీట్ల గొడవకు తెరలేపింది. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి కూటమి గెలుపే లక్ష్యం కావాలని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 20వ వార్డులో పలు వార్డులకు సంబంధించిన పార్టీ శ్రేణులతో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెనాలి నియోజవర్గంపై ఎన్నికల బరిలో ఉండే పార్టీలపై వస్తున్న పుకార్లు నమ్మవద్దని, పార్టీ శ్రేణులను బలోపేతం చేసేలా ఆయన ప్రసంగించారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెనాలిలో పేదల కడుపు నింపేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను మూయించి వారి కడుపు కొట్టిందన్నారు. అన్న క్యాంటీన్లను పార్టీ శ్రేణులు దాతల సహకారంతో కొనసాగిస్తూ వస్తున్నామని, వాటిని తొలగించేందుకు కూడా వైసీపీ నాయకులు యత్నించగా పార్టీ శ్రేణులు ఐకమత్యంగా నిలిచారని గుర్తుచేశారు. అమరావతి రాజధానిగా ఉండాలని సంకల్పంతో మునిసిపల్ కార్యాలయం ఎదురుగా నిరసన కార్యక్రమాలు చేపడితే వాటిని అడ్డుకునేందుకు దీక్ష శిబిరానికి కూడా నిప్పుపెట్టి తగలబెట్టేందుకు చేసిన కుట్రలను గమనించాలన్నారు. మరో రెండునెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ మన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే కుట్రలకు పూనుకుందని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని గ్రామ, పట్టణ వార్డులలోని ప్రతి ఇంటికి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి మినీ మేనిఫెస్టోను ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కొల్లిపర శివ, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, దేసు యుగంధర్, బోయపాటి అరుణ, దివి అనిత, మహమ్మద్ ఖుద్దుస్, పెండ్యాల వెంకట్రావు, అన్నం పిన్నారావు, బ్రహ్మేశ్వరరావు, వినపాటి రవీంద్ర, కొండా రమాదేవి, కరిముల్లా, హైమారావు, హైమారావు, నాగూర్, ఫణిదపు దుర్గ, దివి అనిత, రవితేజ, వసంతం అశోక్, మల్లవరపు విజయకుమార్ పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జనసేనానితో డాక్టర్ పెమ్మసాని భేటీ


పవన్‌కళ్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నేత డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో తెలుగుదేశం పార్టీ నేత, ఎన్ఆర్ఐ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మంగళవారం మంగళగిరి జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దిగేందుకు సిద్ధమైన పెమ్మసాని రెండురోజుల క్రితం తెనాలి మండలంలోని తన స్వగ్రామమైన బుర్రిపాలేనికి చేరుకున్న విషయం తెలిసిందే.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

● మండల వైద్యాధికారి లక్ష్మీసుధ


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీసుధ

కొల్లిపర, ఫిబ్రవరి 13: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గర్భిణులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గర్భిణులు తీసుకోవాల్సి జాగ్రత్తలపై ఏఎన్ఎంలు వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మీసుధ మాట్లాడుతూ ప్రజలకు వైద్యసేవలు అందించే విషయంలో అశ్రద్ధ పనికిరాదన్నారు. ముఖ్యంగా గర్భిణులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పారిశుధ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆరోగ్య సిబ్బంది, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న డీన్ ఉమామహేశ్వరరావు

జేఈఈ మెయిన్స్‌లో ఎన్నారై కళాశాల విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్ పరీక్ష ఫలితాల్లో ఎన్నారై కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించారని డీన్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను మంగళవారం కళాశాలలో సత్కరించారు. మెయిన్స్ ఫేజ్-1 ఫలితాలలో 100 పర్సంటైల్‌కు గాను జె.జగన్నాథ్ 99.85, ఎం.రోహిత్ 99.81 పర్సంటైల్ సాధించారు. మరో 44 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ పైగా సాధించినట్లు ఆయన చెప్పారు. జేఈఈ అడ్వాన్స్‌లో కూడా మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. జోన్ ప్రిన్సిపాల్ శివన్నారాయణ, కృష్ణారెడ్డి, కిషోర్, లాజరస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 13: పట్టణంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో మంగళవారం ఎన్నారై విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో, శివాజీ చౌక్‌లోని అన్న క్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెనిగళ్ళ శివప్రసాద్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, క్రొత్తపల్లి రమేష్, మాదల కోటేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి


చెరుకూరి దివ్యశ్రీ (ఫైల్‌ఫొటో)

తెనాలి రూరల్, ఫిబ్రవరి 13: రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. తెనాలి బాలాజిరావుపేటకు చెందిన చెరుకూరి దివ్యశ్రీ (20) ఓ ప్రైవేటు కాలేజ్‌లో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోంది. మంగళవారం దుగ్గిరాల నుంచి ద్విచక్రవాహనంపై తెనాలి వస్తున్న ఆమె వాహనాన్ని మండలంలోని కంచెర్లపాలెం సమీపంలో వెనుకనుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో దివ్యశ్రీ కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు ఆమెను తెనాలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి చెరుకూరి శ్రీనివాసరావు చుండూరు ఎమ్మార్వో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


రూ.లక్ష విరాళం అందజేస్తున్న శ్రీనివాసరావు

మహా ప్రస్థాన సేవా సమితికి రూ.లక్ష విరాళం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13: తెనాలి మహా ప్రస్థాన సేవా సమితికి శాఖమూరి రాఘవయ్య సతీమణి భాగ్యశ్రీ జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆయన కుమారుడు శాఖమూరి శ్రీనివాసరావు, కుమార్తె నగ రాజకుమారి మంగళవారం విరాళాన్ని సమితి సభ్యులకు అందించారు. కమిటీ అధ్యక్షుడు డాకా సాంబిరెడ్డి, కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మల బాపయ్య, బాపనయ్య, అప్పారావు, ధనుంజయ, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భావనారుషి స్వామి కల్యాణోత్సవాలు


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13: స్థానిక షరాఫ్ బజారులోని శ్రీభద్రావతి సహిత భావనారుషిస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామివారిని పొగడమానోత్సవ వాహనంపై ఘనంగా ఊరేగించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ బిట్రా రామలింగేశ్వరరావు, బట్టు జగత్‌కోటి, నరేంద్రబాబు, క్రాంతికుమార్, ధనలక్ష్మి, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 13: ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం తెల్లవారు జామున పట్టణంలోని వినుకొండ రోడ్డులోని జిలానీ పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకుంది. మండలంలోని కొండకావూరుకు చెందిన సాయి కృష్ణ (30) అనే వ్యక్తి వినుకొండ వైపు నుంచి నరసరావుపేట వస్తుండగా నరసరావుపేట నుంచి ఉప్పలపాడు వైపు వెళ్తున్న శేఖర్ అనే వ్యక్తి మోటారు సైకిల్‌తో ఎదురుగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో సాయి కృష్ణ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుని భార్య విజయలక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా తమకు తక్షణ న్యాయం చేయాలని కోరుతూ నిందితుడిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని మృతుని బంధువులు ప్రభుత్వ వైద్యశాల ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న మొదటి పట్టణ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ వినోద్ కుమార్‌లు ప్రభుత్వ వైద్యశాలకు వద్దకు వెళ్ళి వారితో చర్చించి ధర్నాను విరమింప చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వైసీపీ

● టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 13: ప్రభుత్వ కార్యక్రమాలను వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమాలుగా వినియోగించుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్ మాదల వెంకటేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో ఏ పదవి లేని వైసీపీ ఎంపీ అభ్యర్థి ఉమ్మారెడ్డి వెంకటరమణ, వైసీపీ నాయకులు పాల్గొనటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణంలోని కల్యాణ మండపంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రైవేటు వ్యక్తులను వేదికలపై కూర్చోపెట్టడంపై ఎంపీడీవో, ఏపీఎం వంటి ప్రభుత్వ అధికారులు సమాధానం చెప్పాలన్నారు. డ్వాక్రా మహిళలకు ఆసరా నగదు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుంటే ఎందుకు బహిరంగ సభ నిర్వహించి ప్రచార కార్యక్రమంలా మార్చారని నిలదీశారు. ఈ వేదికపై ఉమారెడ్డి వెంకట రమణ మహిళలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎంపీగా తనను ఎమ్మెల్యేగా కిలారి రోశయ్యను గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించటం తీవ్ర అభ్యంతరకరం అన్నారు. స్థానిక ఎంపీ గల్లాజయదేవ్‌కు కనీస సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కోటా శ్రీనివాసరావు ఏ అర్హతతో వేదికపై కూర్చోబెట్టారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. వీటిపై జిల్లా కలెక్టర్, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారులతో పాటు, ప్రభుత్వ కార్యక్రమాన్ని రాజకీయ ప్రచార వేదికలుగా మార్చుకున్న వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ, మండల టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, బొర్రు రామారావు, పఠాన్ ఫైరోజ్‌ఖాన్, ఎద్దు శోంబాబు, లాడెన్, ధర్మారావు, అన్నిశెట్టి వీరబాబు, సిలార్ బాషా, యానం శివ వేణు, లక్ష్మీనారాయణ చౌదరి, రాధాకృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 13: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు నిమ్మకూరి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. పలువురు కార్మికులు మాట్లాడుతూ వివిధ విభాగాలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు హామీలు అమలు చేయాలని కోరారు. అన్‌స్కిల్డ్ కార్మికులు స్కిల్ ట్రైనింగ్‌కు వెళ్లటానికి అనుమతించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మద్దిరాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పుట్ల శ్యామ్, ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.


సీడీపీవో వెంకట రమణకు వినతిపత్రం అందచేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల హామీలు అమలు చేయాలి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 13: అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎంవీ సుకన్య కోరారు. మంగళవారం సీడీపీవో వెంకటరమణను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు మాట్లాడుతూ ఇటీవల అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం తమకు సంబంధించిన అనేక హామీలను అమలు చేస్తామని వాగ్దానం చేసిందన్నారు. ఈ వాగ్దానాలను అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మలీల

భూమిలేని కౌలు రైతులకు పంట రుణాలు: ఎంపీపీ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 13: భూమిలేని కౌలు రైతులకు పంట రుణాలు అందచేస్తామని మండల పరిషత్ అధ్యక్షురాలు భవనం పద్మలీల అన్నారు. మంగళవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏడీఏ వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటల సాగు వివరాలు తెలియజేశారు. ఈ-క్రాప్ నమోదు గడువు ఈ నెల 15వ తేదీతో పూర్తి అవుతున్నట్లు చెప్పారు. ఈకేవైసీ కూడా పూర్తికానున్నట్లు చెప్పారు. పంట నమోదు చేసుకున్న రైతులు ఫిజికల్ ఎకనాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు. సమావేశంలో రైతులకు అందజేసిన పంట రుణాలు, కౌలు రైతు కార్డుల గురించి చర్చించారు. సమావేశంలో సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.